APTEL /26/A1193

నేటి శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి....
ప్రతిక్షణం... ప్రజల కోసం...
www.netishubhodaya.com
96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, సంపుటి : 1 సంచిక : 195 సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు పేజీలు : 8 శనివారం 5 సెప్టెంబర్ 2026 వెల : 05/-

## సీఎం చంద్రబాబు అధ్యక్షతన రెండు రోజుల పాటు

# కలెక్టర్ల కాన్ఫరెన్స్



అమరావతి, సెప్టెంబర్ 4 : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన 8వ కలెక్టర్ల సదస్సు నిర్వహించడానికి సర్వం సిద్ధమైంది. ఈ నెల 10, 11వ తేదీల్లో ఈ సదస్సు జరగనుంది. రెండు రోజుల పాటు నిర్వహించనున్న కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు పలు కీలక అంశాలపై కలెక్టర్లకు దిశానిర్దేశం చేయనున్నారు. తొలి రోజు గత సదస్సు నిర్ణయాల అమలుపై సమీక్షించనున్నారు. రాష్ట్ర ఆర్థిక వృద్ధి, జిల్లా వారీ లక్ష్యాలపై కలెక్టర్లు ప్రెజెంటేషన్ ఇవ్వనున్నారు. స్వర్ణ ఆంధ్ర--2047 జిల్లా రోడ్‌మ్యాప్‌లపై ప్రత్యేకంగా సీఎం చంద్రబాబు చర్చించనున్నారు. సూపర్ సిక్స్, సంక్షేమ పథకాల అమలుపై సమీక్షించనున్నారు. ఆరోగ్యం, విద్యాశాఖ పనితీరుపై కలెక్టర్లతో సీఎం చంద్రబాబు చర్చించనున్నారు. పెట్టుబడులు, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై మాట్లాడనున్నారు. జలధార కార్యక్రమం పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. జిల్లా కలెక్టర్ల ఉత్తమ ఆవిష్కరణలకు ప్రత్యేక ప్రదర్శన, వివరణ ఇవ్వనున్నారు. రెండో రోజు ఈ-గవర్నెన్స్, RTGS, PGRS పనితీరుపై ముఖ్యమంత్రి సమీక్షించనున్నారు. భూ పరిపాలన, కేంద్ర పథకాల నిధుల వినియోగంపై చర్చించనున్నారు. జిల్లా కలెక్టర్లతో ఓపెన్ ఫోరంలో క్షేత్రస్థాయి సమస్యలపై మాట్లాడనున్నారు. చివరి రోజు శాంతిభద్రతల సమీక్షతో పాటు ముగింపు ప్రసంగాన్ని సీఎం చంద్రబాబు చేయనున్నారు.

## రాజమండ్రిలో సగం కాలుష్యానికి

# కారణం ఇదే



- పుష్కర కాలంగా పన్నులు ఎగవేస్తున్న ఆంధ్ర పేపర్ మిల్లు
- రాజమండ్రి కాలుష్యంలో సగం ఆ పరిశ్రమ వల్లేనన్న పవన్
- పద్ధతి మార్చుకోకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక
- కోర్టు కేసులను వేగవంతం చేయాలని న్యాయవాదులకు ఆదేశాలు
- స్వచ్ఛ గోదావరి లక్ష్యంగా ముందుకెళతామన్న ప్రభుత్వం

రాజమండ్రిలోని ఆంధ్ర పేపర్ లిమిటెడ్ (ఏపీఎల్) తీరుపై రాష్ట్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పుష్కర కాలంగా పన్నులు ఎగవేస్తూ, మరోవైపు గోదావరి నదిని తీవ్రంగా కలుషితం చేస్తూ బాధ్యతారహితంగా వ్యవహరిస్తోందని ఆయన విరుచుకుపడ్డారు. రాజమండ్రిలో సగం కాలుష్యానికి ఈ కంపెనీయే కారణమని ఆరోపించారు. పద్ధతి మార్చుకోకపోతే పరిశ్రమ కార్యకలాపాలను నిలిపివేయడం దగ్గర నుంచి లైసెన్సు రద్దు వరకు ఎలాంటి కఠిన చర్యలకైనా వెనుకాడబోమని స్పష్టం

2 లో

## ఆ నిర్మాణాల నాణ్యత విషయంలో

# రాజీపడొద్దు



కొడంగల్, సెప్టెంబర్ 4 : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈరోజు (శుక్రవారం) కొడంగల్ నియోజకవర్గంలో పర్యటించి, పలు అభివృద్ధి

మిగతా 2లో...



# విశ్వాసానికి ప్రతిబింబం..

2 లో

## మెలోనికి మోదీ అభినందనలు

ఢిల్లీ, సెప్టెంబర్ 4 : ఇటలీ రాజకీయ చరిత్రలో ప్రధాని జార్జియా మెలోని నూతన అధ్యాయాన్ని లిఖించారు. రెండో ప్రపంచ యుద్ధం (Post-war) తర్వాత ఇటలీలో అత్యంత సుదీర్ఘకాలం పాటు నిరంతరాయంగా పాలించిన ప్రధానమంత్రిగా ఆమె రికార్డు సృష్టించారు. 1,413 రోజుల పాటు నిరంతరంగా పదవిలో కొనసాగడం ద్వారా, గతంలో సిల్వియో

## చంద్రబాబుతోనే సాగునీటి

# ప్రాజెక్టుల పూర్తి



అమరావతి, సెప్టెంబర్ 4 : రాయలసీమను మొదలుకొని ఉత్తరాంధ్ర వరకు ఆర్థిక, సామాజిక పరంగా ఏపీని అగ్రభాగాన నిలిపేందుకు చంద్రబాబు శ్రమిస్తున్నారని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. ఈరోజు(శుక్రవారం) మీడియాతో మాట్లాడుతూ... చంద్రబాబు ఎప్పుడు అధికారంలో ఉన్నా సాగునీటి రంగానికి కొత్త కళ వస్తుందని చెప్పుకొచ్చారు. ప్రాజెక్టుల పనులను పరుగులు పెట్టించే శక్తి ఆయనకు మాత్రమే ఉ ందన్నారు. రాయలసీమకు అదనపు జలాలు తీసుకురావాలనే ఆలోచన చేసింది ఎన్టీఆర్ అని... ఆయన ఆశలను ఆకాంక్షలను ఆచరణలో పెట్టిన వ్యక్తి చంద్రబాబు

మిగతా 2లో...



# పెట్టుబడుల వేట.. వ్యక్తిగత అంశాలు

## విజయ్ తొలి విదేశీ పర్యటనపై తమిళనాట చర్చ

- సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలి విదేశీ పర్యటన
- ఈ నెల 10 నుంచి 16 వరకు బ్రిటన్‌లో పర్యటించనున్న విజయ్
- భార్య, కుమార్తెలను విజయ్ కలుస్తాడంటూ ప్రచారం

సెప్టెంబర్ 4 : తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత విజయ్ తన తొలి అధికారిక విదేశీ పర్యటనకు సిద్ధమవుతున్నారు. రాష్ట్రానికి భారీగా పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఆయన ఈ నెల 10 నుంచి 16 వరకు బ్రిటన్ లో పర్యటించనున్నారు. లండన్‌లో జరిగే పలు కీలక పారిశ్రామికవేత్తల సమావేశాల్లో పాల్గొని ఉన్నత స్థాయి చర్చలు

2 లో

# కేరళలో నారా లోకేశ్.. అమృతపురిలో 'అమ్మ' ఆశీర్వాదం

- కేరళలో పర్యటించిన మంత్రి నారా లోకేశ్
- కొల్లం జిల్లాలోని అమృతపురి ఆశ్రమం సందర్శన
- మాతా అమృతానందమయి ఆశీస్సులు అందుకున్న లోకేశ్
- ఆశ్రమంలోని అమృత విశ్వ విద్యాపీఠాన్ని పరిశీలించిన వైనం
- ఈ పర్యటన వ్యక్తిగతమని, అధికారికం కాదని సమాచారం

సెప్టెంబర్ 4 : ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శుక్రవారం కేరళలో పర్యటించారు. కొల్లం జిల్లాలోని ప్రఖ్యాత ఆధ్యాత్మిక కేంద్రమైన మాతా అమృతానందమయి (అమ్మ) ఆశ్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మను దర్శించుకుని ఆమె ఆశీస్సులు అందుకున్నారు. ఇది పూర్తిగా లోకేశ్ వ్యక్తిగత పర్యటన అని, అధికారిక



కార్యక్రమం కాదని తెలుస్తోంది. అమృతపురిగా ప్రసిద్ధి చెందిన ఈ ఆశ్రమంలో లోకేశ్ దాదాపు మూడు గంటల పాటు గడిపారు. ఆశ్రమ ప్రాంగణంలో ఉన్న కాళీమాత ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. అనంతరం అమ్మను కలుసుకుని ఆశీర్వాదం పొందారు. ఆశ్రమంలోని గజరాజులకు పండ్లు అందిం చారు. ఈ పర్యటన తనకు ఎంతో ఆధ్యాత్మిక సంతృప్తిని చ్చిందని లోకేశ్ పేర్కొన్నారు. తన పర్యటనకు సంబం ధించిన వివరాలను ఆయన తన ఎక్స్ ఖాతాలో పంచు కున్నారు. ఈ ఆధ్యాత్మిక పర్యటనలో భాగంగా లోకేశ్ అక్కడి విద్యాసంస్థలను కూడా పరిశీలించారు. ఆశ్రమం ఆధ్వర్యంలో నడుస్తున్న అమృత విశ్వ విద్యాపీఠంతో పాటు, అమృత ఆయుర్వేద కళాశాలను ఆయన సందర్శించారు. అక్కడి విద్యాబోధన, మౌలిక సదుపా యాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఏపీ విద్యాశాఖ మంత్రిగా ఆయన విద్యాపీఠాన్ని సందర్శించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# పెట్టుబడుల వేట.. వ్యక్తిగత అంశాలు

జరపనున్నారు. అయితే, ఈ పర్యటన కేవలం అధికారిక కార్యకలాపాలకే కాకుండా ఆయన వ్యక్తిగత జీవితానికి సంబంధించింది అంటూ జోరుగా ప్రచారం జరుగుతోంది.

ఇటీవల విజయ్ భార్య సంగీత విడాకుల పిటిషన్‌ను ఉపసంహరించుకోవడంతో వారిద్దరి మధ్య మనస్పర్థలు తొలగిపోయాయనే వార్తలు జోరుగా వినిపిస్తున్న నేపథ్యంలో, లండన్‌లో నివసిస్తున్న భార్య సంగీత, కుమార్తె దివ్యలను ఆయన ఈ పర్యటనలో కలుసుకోనున్నారని ప్రచారం జరుగుతోంది. మరోవైపు, ఇదే సమయంలో నటి త్రిష కూడా ఓ షూటింగ్ నిమిత్తం యూరప్‌లోనే ఉండటంతో సోషల్ మీడియాలో రకరకాల ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తానికి, రాష్ట్రంలో పెట్టుబడులు సాధించే ముఖ్యమైన లక్ష్యంతో పాటు వ్యక్తిగత జీవితపు ప్రాధాన్యతల నడుమ సీఎం విజయ్ తొలి విదేశీ పర్యటన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.

# ఆ నిర్మాణాల నాణ్యత విషయంలో రాజీపడొద్దు

కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మద్దూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నిర్మాణంలోని సాంఘిక సంక్షేమ గురుకులం పనులను పరిశీలించారు. అలాగే, దౌల్తాబాద్ మండలం గోకఫసల్వాడ్‌లో నిర్మాణంలో ఉన్న.. సాంఘిక సంక్షేమ గురుకులం పనులను పరిశీలించారు.

దౌల్తాబాద్ ప్రభుత్వ జూనియర్ కాలేజ్ పనులను పరిశీలించనున్నారు. నిర్మాణాల నాణ్యత విషయంలో రాజీపడొద్దని అన్నారు. నిర్ణీత గడువులోగా భవన నిర్మాణాలు పూర్తిచేయాలని ఆదేశించారు. హకీంపేట ఎడ్యుకేషన్ హబ్ పనులను పరిశీలించిన అనంతరం.. నియోజకవర్గ అభివృద్ధి పనులపై సమీక్షించనున్నారు. రోడ్డుమార్గాన కొడంగల్ చేరుకొని అక్కడే బస చేయనున్నారు. రేపు (శనివారం) కొడంగల్‌లో పలు అభివృద్ధి పనులపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష చేయనున్నారు.

# రాజమండ్రిలో సగం కాలుష్యానికి కారణం ఇదే

చేశారు. ఈ మేరకు కంపెనీకి షోకాజ్ నోటీసులు జారీ చేసి, తక్షణమే చర్యలు చేపట్టాలని కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అధికారులను ఆదేశించారు.

పుష్కర కాలంగా పన్ను ఎగవేత

2016 నుంచి కాతేరు గ్రామ పంచాయతీకి గానీ, రాజమండ్రి నగరపాలక సంస్థకు గానీ ఆంధ్ర పేపర్ మిల్లు ఒక్క రూపాయి కూడా పన్ను చెల్లించలేదని పవన్ కల్యాణ్ ఆరోపించారు. స్థానిక సంస్థలకు సుమారు రూ. 21.34 కోట్ల మేర పన్నులు బకాయిపడిందని ఆయన తెలిపారు. పన్ను చెల్లించాలని అధికారులు నోటీసులు జారీ చేసిన ప్రతిసారీ, యాజమాన్యం కోర్టులను ఆశ్రయించి జాప్యం చేస్తోందని, బాధ్యత నుంచి తప్పించుకుంటోందని మండిపడ్డారు. ప్రభుత్వంతో సంబంధం లేకుండా సొంతంగా పన్ను మినహాయింపు ఇచ్చుకున్నారా? అని ఆయన నిలదీశారు.

గోదావరిని కమ్మేస్తున్న కాలుష్యం

అధికారిక గణాంకాల ప్రకారమే రాజమండ్రి నగరంలోని మొత్తం కాలుష్యంలో సగం ఆంధ్ర పేపర్ మిల్లు నుంచే వస్తోందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. నగరం మొత్తం మీద రోజుకు 70 మిలియన్ లీటర్ల ద్రవ వ్యర్థాలు ఉత్పత్తి అయితే, ఒక్క ఆంధ్ర పేపర్ మిల్లు నుంచే 35 మిలియన్ లీటర్ల వ్యర్థాలు వెలువడుతున్నాయని వివరించారు. ఈ వ్యర్థ జలాల్లో ప్రమాదకర రసాయనాలు నిర్దేశిత పరిమితికి మించి ఉన్నాయని పరీక్షల్లో తేలిందన్నారు. లాగూన్ల వద్ద సేకరించిన నీటి నమూనాల్లో బయోకెమికల్ ఆక్సిజన్ డిమాండ్ (బీఓడీ) లీటరుకు 36 మిల్లీగ్రాములుగా ఉందని, ఇది ప్రమాణాల కన్నా 20 శాతం అధికమని తెలిపారు. అదేవిధంగా ఫాస్పేట్ 6 శాతం, సల్ఫైడ్‌లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రమాణాల కన్నా ఏకంగా 70 శాతం అధికంగా ఉన్నాయని ఆయన వెల్లడించారు.

పర్యావరణం, ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం

పరిశ్రమ విడుదల చేస్తున్న కాలుష్యం వల్ల గోదావరి నీటిలో ఆక్సిజన్ స్థాయిలు తగ్గి జలచరాల మనుగడకు ముప్పు వాటిల్లుతోందని, నది సహజ పర్యావరణ వ్యవస్థ దెబ్బతింటోందని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. దుర్వాసన, నీటి నాణ్యత క్షీణతతో ప్రజారోగ్యానికి హాని కలుగుతోందని, భవిష్యత్ తరాల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోందని అన్నారు. గతంలో తాను క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడు భూగర్భ జలాలు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించినా, యాజమాన్యం పట్టించుకోలేదని గుర్తుచేశారు.

ఇక ఉపేక్షించేది లేదు..

నిబంధనలు ఉల్లంఘిస్తున్నందున పరిశ్రమ కార్యకలాపాలను నిలిపివేయడం, జరిమానాలు విధించడం, కంపెనీని సీజ్ చేయడం, లైసెన్సును రద్దు చేయడం వంటి కఠిన చర్యలు తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉందని పవన్ కల్యాణ్ హెచ్చరించారు. అయితే, పరిశ్రమలను ఇబ్బంది పెట్టకూడదనే ఉద్దేశంతోనే సంకీర్ణ ప్రభుత్వం ముందుగా షోకాజ్ నోటీసులు జారీ చేసి, తప్పు సరిదిద్దుకునే అవకాశం ఇచ్చిందని తెలిపారు. గత మూడు నెలలుగా పీసీబీ అధికారులు సంస్థ ప్రతినిధులతో పలుమార్లు చర్చించినా స్పందన కరువైందని అన్నారు. ఈ నేపథ్యంలో తక్షణమే సమన్లు జారీ చేసి, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇలాంటి కేసుల విచారణను వేగవంతం చేసేలా చూడాలని అడ్వకేట్ జనరల్, అదనపు ఏజీ, ఇతర ప్రభుత్వ న్యాయవాదులకు సూచించారు. 'స్వచ్ఛ గోదావరి – పవిత్ర పుష్కరాలు' నినాదంతో గోదావరి పరిరక్షణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు పర్యావరణవేత్తలు, పౌర సమాజం మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. ప్రజల ప్రయోజనాలు, పర్యావరణ పరిరక్షణకే తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

# విశ్వాసానికి ప్రతిబింబం.. మెలోనికి మోదీ అభినందనలు

బెర్లుస్కోనీ నేతృత్వంలోని ప్రభుత్వం (2001–2005) పేరిట ఉన్న 1,412 రోజుల రికార్డును మెలోని దాటేశారు. ఈ చరిత్రాత్మక విజయం సాధించిన సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనికి సోషల్ మీడియా వేదికగా (X) ప్రత్యేక అభినందనలు తెలిపారు. 'ఇటలీ యుద్ధానంతర చరిత్రలో అత్యధిక కాలం నిరంతరాయంగా పనిచేసిన ప్రధానమంత్రిగా నిలిచిన నా మిత్రురాలు, ప్రధానమంత్రి మెలోనికి అభినందనలు.

ఈ మైలురాయి ఆమె నాయకత్వంపై ఇటలీ ప్రజలకు ఉన్న నమ్మకానికి, విశ్వాసానికి ప్రతిబింబం' అని ప్రధాని మోదీ శలో పోస్ట్ చేశారు. దౌత్య, ఆర్థిక సంబంధాలను బలోపేతం చేయడంలో మెలోని వ్యూహాత్మక సహకారాన్ని నొక్కిచెబుతూ ప్రధాని మోదీ.. 'భారత్–ఇటలీ ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ఆమె స్నేహం కూడా కీలక పాత్ర పోషించింది. మన ఇరు దేశాల ప్రజల కోసం ఒక సుసంపన్నమైన భవిష్యత్తును నిర్మించడానికి, మన సన్నిహిత సహకారాన్ని కొనసాగించడానికి ఎదురుచూస్తున్నాను'. రాబోయే సంవత్సరాల్లో ఆమె నిరంతర విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నానని మోదీ తన శుభాకాంక్షల సందేశంలో పేర్కొన్నారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత గత 80 ఏళ్లలో దాదాపు 68 ప్రభుత్వాలు మారిన ఇటలీ రాజకీయాల్లో, ఒక ప్రభుత్వం పూర్తికాలం స్థిరంగా కొనసాగడం అత్యంత అరుదైన విషయం. అటువంటి రాజకీయ వాతావరణంలో అక్టోబర్ 2022లో ఇటలీ తొలి మహిళా ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన మెలోని, అత్యంత స్థిరమైన పాలనను అందిస్తూ ఈ మైలురాయిని చేరుకున్నారు.

# చంద్రబాబుతోనే సాగునీటి ప్రాజెక్టుల పూర్తి

అని తెలిపారు. కర్నూలు, కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాలకు మేలు కలిగించే హంద్రీనీవాకు రూ.8 వేల కోట్లు ఖర్చు చేసిన ఘనత చంద్రబాబుది అని కొనియాడారు. 2014–19లో రూ.12,441 కోట్లు రాయలసీమకు చంద్రబాబు ఖర్చు చేస్తే.. జగన్ రూ.2 వేల కోట్లు ఖర్చు చేశారన్నారు. 30 ఏళ్ల వెలిగొండ కలను సాకారం చేసి ప్రకాశం జిల్లాకు కృష్ణా జలాలు అందించిన నేత చంద్రబాబు అని అన్నారు. ఏ ప్రాంతంలో అయితే సాగు, తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడుతున్నారో అటువంటి చోట గోదావరి, కృష్ణా జలాలనుతరలించి ఆ ప్రాంతాల అభివృద్ధికి సీఎం పెద్దపీట వేస్తున్నారని అన్నారు. రాయలసీమ, కోస్తా, ఉత్తరాంధ్ర అయినా సాగునీటి ప్రాజెక్టుల పేరు చెప్పే నాయకుడు చంద్రబాబు అని.. సాగునీటి ప్రాజెక్టుల పేరు ఎత్తే హక్కు, అర్హత జగన్ రెడ్డికి లేదని ప్రభుత్వ విప్ విమర్శించారు. వెలిగొండకు రూ.5,233 కోట్లు చంద్రబాబు ఖర్చు చేస్తే... జగన్ ఖర్చు చేసింది కేవలం రూ.841 కోట్లు అని వెల్లడించారు. 55 శాతం పనులు చేసిన చంద్రబాబుది క్రెడిట్ చోరీనా... 8 శాతం పనులు చేసిన జగన్‌ది క్రెడిట్ చోరీనా అని ప్రశ్నించారు. రాయలసీమ లిఫ్ట్ పేరుతో తెలంగాణ వాసులకు రాయలసీమపై వ్యతిరేక భావన నింపిన దుర్మార్గుడు జగన్ అంటూ మండిపడ్డారు. నవ్యాంధ్రకు 512 టీఎంసీల కృష్ణా జలాలను సాధించి రాష్ట్రానికి తీసుకొచ్చిన నేత చంద్రబాబు అని అన్నారు. 798 అడుగుల నుంచే కృష్ణా జలాలను రాయలసీమకు ముచ్చుమర్రి ద్వారా తీసుకెళ్లేందుకు టీడీపీ అధినేత కృషి చేశారన్నారు. పోలవరంకి చంద్రబాబు రూ.20,085 కోట్లు ఖర్చు చేస్తే... వైఎస్ఆర్, జగన్‌లు కేవలం రూ.3,021 కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. పోలవరం క్రెడిట్ చంద్రబాబుది అని.. క్రెడిట్ చోరీ చేస్తోంది జగన్ అంటూ ఆరోపించారు. ఏ నాయకత్వంలో ప్రాజెక్టులు పూర్తవుతున్నాయి.. ఏ నాయకుడి వల్ల ప్రాజెక్టులు కుంటుపడ్డాయో ప్రజలు గమనిస్తున్నారని శ్రీనివాసులు తెలిపారు. వైఎస్ఆర్, జగన్ రెడ్డిల వల్లే పోలవరం ఇంత ఆలస్యం అయిందని వ్యాఖ్యానించారు. ఇన్ని వాస్తవాలు కళ్ల ముందు కనిపిస్తున్నా పోలవరం, వెలిగొండపై క్రెడిట్ చోరీ డ్రామాలు ఆడుతున్నారని దుయ్యబట్టారు. రాబోయే మూడేళ్లల్లో 36 సాగునీటి ప్రాజెక్టులను రూ.35 వేల కోట్లతో పూర్తి చేయబోతున్నామని చెప్పారు. హంద్రీనీవా ద్వారా రాయలసీమకు, వెలిగొండ ద్వారా ప్రకాశంకి, పోలవరం ద్వారా ఉత్తరాంధ్రకు, పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు నీళ్లు ఇచ్చిన ఘనత చంద్రబాబుది అని కొనియాడారు. చంద్రబాబుతోనే సాగునీటి ప్రాజెక్టులు పూర్తవుతాయని.. ఆయన వల్లే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని కాల్వ శ్రీనివాసులు పేర్కొన్నారు.

# గుడివాడలో ముగ్గురు టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు రూ.15 లక్షల సభ్యత్వ బీమా చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము





గుడివాడ, సెప్టెంబర్ 04: కష్టకాలంలో కార్యకర్తల కుటుంబాలకు తెలుగుదేశం పార్టీ అండగా నిలుస్తుందని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ప్రమాదవశాత్తు మృతి చెందిన ముగ్గురు టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు పార్టీ సభ్యత్వ బీమా కింద మంజూరైన రూ.15 లక్షల చెక్కులను ఎమ్మెల్యే రాము శుక్రవారం గుడివాడ ప్రజావేదిక కార్యాలయంలో అందజేశారు. వివిధ ప్రమాదాల్లో మృతి చెందిన గుడ్లవల్లేరుకు చెందిన గుమ్మడి శ్రావణి, అంగులూరుకు చెందిన చింతా విజయలక్ష్మి, వడ్లమన్నాడు కు చెందిన కొనతం శ్రీరామ మూర్తి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ.15 లక్షల సభ్యత్వ బీమా చెక్కులను కూటమి నాయకులతో కలిసి ఎమ్మెల్యే రాము అందించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాల సభ్యులు మాట్లాడుతూ.. తమ కుటుంబ సభ్యులను కోల్పోయిన సమయంలో ఆర్థికంగా అండగా నిలిచిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సభ్యత్వం ద్వారా లభించిన బీమా సాయం తమ కుటుంబాలకు ఎంతో భరోసానిచ్చిందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే వెన్నెముక అని అన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు, వారి కుటుంబాలకు కష్టసమయంలో అండగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు,మంత్రి లోకేష్ లక్ష్యమన్నారు. ప్రమాదవశాత్తు కార్యకర్తలను కోల్పోయిన కుటుంబాలకు పార్టీ సభ్యత్వ బీమా ద్వారా ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమన్నారు.కార్యకర్తల సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని రాము తెలిపారు. పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తకు అందుబాటులో అందుబాటులో ఉంటూ కష్ట కాలంలో నాయకత్వం వారికి అండగా ఉంటుందన్నారు. బాధిత కుటుంబాలకు అవసరమైన సమయంలో ప్రభుత్వ పరంగా, పార్టీ పరంగా తనవంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యకర్తలకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని, కార్యకర్తల కుటుంబాలను తమ కుటుంబాలుగా భావించి ఆదుకుంటామని ఎమ్మెల్యే రాము స్పష్టం చేశారు. గుడ్లవల్లేరు మండల పార్టీ ప్రెసిడెంట్ పోలవరపు వెంకటరావు, పార్టీ నాయకులు పామర్తి సత్తిబాబు, వల్లభనేని రంగబాబు, పెద్దిబోయిన రాజు, కంచర్ల ప్రకాష్, పెన్నేరు రమేష్, గరికిపాటి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# ఆరో ప్లాంట్‌తో మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

**- రూ.4 కోట్లతో కమ్యూనిటీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్**
**- సురక్షితమైన తాగునీరు అందించడమే లక్ష్యం ప్లాంట్ల ప్రారంభోత్సవ సభలో ఎమ్మెల్యే ఏలూరి**





కారంచేడు, సెప్టెంబర్ 4: ప్రజలకు సురక్షితమైన మంచినీటిని అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. కారంచేడులో సి ఎస్ ఆర్ నిధులు రూ.4 కోట్లతో ఏర్పాటు చేసిన 3 కమ్యూనిటీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను శుక్రవారం రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, బాపట్ల ఎంపీ కృష్ణప్రసాద్, మాజీ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వరరావు, దగ్గుబాటి హితేష్, ఆర్డీవో నరసింహారావులతో కలిసి ఎమ్మెల్యే ఏలూరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏలూరి మాట్లాడుతూ కారంచేడు ప్రజల మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా కమ్యూనిటీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఉపయోగపడుతుందన్నారు. ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన తాగునీరు అందించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. సామాజిక బాధ్యత కింద ఓఎన్జిసి సీఎస్ఆర్ నిధులను సమీకరించి రూ.4 కోట్లతో ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పార్లమెంట్ సభ్యురాలు పురందేశ్వరి చూపిన చొరవ గొప్ప విషయం అన్నారుముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుచూపుతోనే పట్టిసీమ జలాలు అందుబాటులోకి వచ్చాయని, వాటిని ప్రజలకు, రైతులకు ఉపయోగపడేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఏలూరి పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి మౌలిక వసతులను బలోపేతం చేసేందుకు జలజీవన్ మిషన్ కింద రూ.4 కోట్లతో పనులు చేపడుతున్నామని తెలిపారు. ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మంచినీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వ పథకాలతో పాటు సీఎస్ఆర్ నిధులను సమర్థంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన తాగునీరు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. మంచినీటికీ శాశ్వత పరిష్కారం అందించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు వాటర్ గ్రిడ్ పథకం తీసుకురావాలని శ్రమిస్తున్నారని, ప్రస్తుతం నరసరావుపేట వరకు నాగార్జునసాగర్ నీటితో పైప్లైన్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. గ్రామాభివృద్ధి లక్ష్యంగా పర్మనెంట్ గా స్వచ్ఛమైన నీరు అందించేందుకు ప్రభుత్వ పనిచేస్తుందన్నారు.

## పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం 120 ఎకరాల భూమిచ్చిన సీనియర్ లీడర్ "కరాటం రాంబాబు" కు జానశిక్షణ సంస్తాన్ మాజీ డైరెక్టర్ పులి శ్రీరాములు ప్రశంస



ఏలూరు, సెప్టెంబర్ 4, నేటి శుభోదయ :రాష్ట్ర ప్రజలు జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణం లో డి సి సి బి చైర్మన్, ఏజెన్సీ ప్రముఖులు కరాటం రాంబాబు చేసిన కృషి ప్రశంసనీయమని కేంద్ర ప్రభుత్వ మానవవనరుల మంత్రిత్వ శాఖ జనశిక్షణ సంస్థాన్ మాజీ డైరెక్టర్ పులి శ్రీరాములు అభినందనలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన లో పోలవరం నిర్వాసిత గ్రామాల తరలింపు సందర్బంగా భూమికి భూమి ఇవ్వవలసిన నేపథ్యంలో తమ కుటుంబానికీ చెందిన 120 ఎకరాల భూమిని నిర్వాసితులకు ఇవ్వడం గొప్ప విషయమని శ్రీ రాములు అభినందిం చారు. నిర్వాశిత కుటుంబాలకు భూమికి భూమి అందచేసే నిమిత్తం ప్రభుత్వం ద్వారావారికీ రాంబాబు ముందుగా అందించారన్నారు. అలాగే డీసిసిబి కి నిర్వాసితులు బకాయి ఉన్న రూ 3 కోట్ల రుణాలు ఆ టైమ్ లో డిసీసీబి ఛైర్మన్ గా ఉన్న కరాటం రాంబాబు రద్దుచేశారని ఇది కష్టం లో వున్ననిర్వాశీత కుటుంబాలకు పెద్ద ఊరట అన్నారు. పెద్ద మనస్సు కలిగిన కరాటం రాంబాబు వంటి అభివృద్ధి ప్రదాత ఉమ్మడి జిల్లా కే గర్వకారణమని పులి శ్రీరాములు అభినందించారు.

## సినిమా స్టైల్లో ఎర్రచందనం స్మగ్లర్ల పరార్

### 10 దుంగలు, 2 కార్లు సీజ్, రూ.10 లక్షల విలువ



అన్నమయ్య, సెప్టెంబర్ 4, నేటి శుభోదయ : అన్నమయ్య జిల్లా పీలేరులో ఎర్రచందనం స్మగ్లర్లపై అటవీ శాఖ సంచార దళం మెరుపుదాడి చేసింది. పక్కా సమాచారంతో చిత్తూరు రోడ్డులోని ఎంఆర్‌జేఆర్ కళాశాల సమీపంలో ఓ కారును అడ్డగించి ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుంది. ఇదే సమయంలో మరో కారును అధికారులు వెంబడించగా స్మగ్లర్లు సినిమా ఛేజింగ్ సీన్‌ను తలపించేలా వాహనాన్ని వేగంగా నడిపి తప్పించుకునేందుకు యత్నించారు. అయితే పులిచెర్ల మండలం కల్లూరు ఘాట్ వద్ద కారు టైరు పేలిపోవడంతో వాహనాన్ని అక్కడే వదిలి అడవిలోకి పరారయ్యారు. రెండు వేర్వేరు ఆపరేషన్లలో 10 ఎర్రచందనం దుంగలు, రెండు కార్లను స్వాధీనం చేసుకున్నట్లు డీఎఫ్ఓ వేణు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.10 లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. కేసు నమోదు చేసి పరారీలో ఉన్న స్మగ్లర్ల కోసం గాలింపు కొనసాగిస్తున్నారు.

## 10న ఛలో హైదరాబాద్ బాట పట్టండి

### - పిఆర్సి, డిఏ ప్రకటించాలి - ఉద్యోగ విరమణ బకాయిలు సత్వరం చెల్లించాలి - హెల్త్ కార్డులు పెన్షనర్ల పాట్లు









ఖమ్మం, సెప్టెంబర్ 4, నేటి శుభోదయ : పెన్షనర్ల, ఉద్యోగ ఉపాధ్యాయుల హక్కులు, న్యాయం, గౌరవం కోసం ఈనెల 10 న హైదరాబాద్ లో జరిగే హక్కుల సాధనసభలో వందలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం(ఎస్జిపిఏటి) రాష్ట్ర కార్యదర్శి మేరి ఏసుపాదం, జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య కోరారు. శుక్రవారం ఎస్జిపిఏటి ముఖ్యకార్యకర్తల సమావేశం కృషిభవన్ లో జరిగింది.సమావేశానికి అధ్యక్షత వహించిన పరిశ పుల్లయ్య మాట్లాడుతూ పెన్షనర్లు, ఉపాధ్యాయ, ఉద్యోగుల హక్కులు, న్యాయం, గౌరవం కోసం ఈనెల 10 న జరిగే హక్కుల సాధన సభలో పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.పిఆర్సి సత్వరం ప్రకటించాలని,డిఏ మంజూరు చేయాలని,హెల్త్ స్కీమ్ సక్రమంగా నిర్వహించాలని, పెన్షనర్ల ఉద్యోగ విరమణ బకాయిలు సత్వరం చెల్లించాలని, పెన్షనర్ల కోసం ప్రత్యేక డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలని, ప్రత్యేక ఉపాధ్యాయులకు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని ఎస్జిపిఏటి జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు.ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్ల సమస్యలు పరిష్కారం జరిగేవరకు జేఏసి తన ఉద్యమ కార్యాచరణ కొనసాగించాలని రాష్ట్ర కార్యదర్శి మేరి ఏసుపాదం కోరారు.పెన్షనర్ల సమస్యల పట్ల ప్రభుత్వం తన వైఖరి మార్చుకోవాలని జిల్లా ప్రధాన కార్యదర్శి రాయల రవికుమార్ కోరారు.సమావేశంలో జిల్లా నాయకులు కనపర్తి వెంకటేశ్వర్లు, పెదమళ్ళ సత్యనారాయణ, కొలికొండ శరత్ బాబు, బోజెడ్ల కృష్ణకుమారి, బెల్లం రాధాకృష్ణ మూర్తి, ఊడుగు సుధాకర్ రావు, యండి హుస్సేన్, పివిఆర్కేవి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత. సి ఐ





చింతూరు, సెప్టెంబర్ 4, నేటి శుభోదయ : మహిళల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని చింతూరు సిఐ గోపాలకృష్ణ, మహిళా పోలీస్ స్టేషన్ సిఐ కన్నప్ప రాజు సంయుక్తంగా పేర్కొన్నారు. ఈ మేరకు ఏడుగురాళ్లపల్లి గ్రామం లోని సంత మార్కెట్లో శుక్రవారం మహిళల భద్రతపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. మహిళలకు జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు, మొబైల్లో వచ్చే మెసేజ్ మోసాల పట్ల, అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. పోలీసువున్నతాధికారులైన జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్, ఏ ఎస్ పి బోడ్డు హేమంత్ ఆదేశాల మేరకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ గ్రామాన తమ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. .మొబైల్ వాడకం పెరిగిన కొద్ది మోసాలు పెరుగుతున్నాయని మహిళలు, యువత అప్రమత్తంగా ఉండాలని కోరారు.మహిళలను, విద్యార్థినులను ఎవరైనా ఈవ్ టీజింగ్ చేస్తే 112 నెంబర్ కు కాల్ చేయాలన్నారు. మహిళల భద్రత గూర్చి మాట్లాడుతూ కొంతమంది మోసగాళ్లు మొబైల్ ద్వారా మహిళలను ట్రాప్ చేసి మోసగిస్తారని మొబైల్ తో అప్రమత్తంగా ఉండాలని అలాంటివారు ఎవరైనా మహిళలను అల్లరి పెడితే తమ దృష్టికి తేవాలన్నారు. విద్యార్థినులు శక్తి యాప్ ను డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. .మొబైల్ వాడకం పెరుగడం వల్ల మోసాలు కూడా అంతే స్థాయి లో పెరుగు తున్నాయన్నారు.మొబైల్ లో డిజిటల్ అరెస్ట్ చేశామని మొబైల్ వాడకం దారులకు అక్రమ కాల్స్ వస్తుంటాయని, అలాంటి అరెస్టులు ఏమి ఉండవని, ఆ విధమైన కాల్స్ వస్తే వెంటనే తమకు తెలపాలని కోరారు. అలాగే యువతను ఉద్దేశించి చెడు వ్యసనాలపై అవగాహన కల్పించారు. బహిరంగంగా మద్యం సేవించడం కూడా నేరమేనన్నారు. డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా పెంచి బహిరంగంగా మద్యం సేవించే వారిని కనుగొని కేసులు పెడతామని, వదిలిపెట్టేది లేదని, అలాగే అతివేగంగా వాహనాలు నడపటం, లైసెన్సు లేకుండా వాహనాలు నడపటం, ద్విచక్ర వాహనంపై ముగ్గురు నలుగురు కూర్చోని ప్రయాణించటం నేరం అన్నారు. వాహన యజమానులు తమ మైనర్ బాల బాలికలకు వాహనాలు నడపటానికి ఇవ్వకూడదని, అలా ఇవ్వడం నేరమని మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు పెడతామని పేర్కొన్నారు .గంజాయి సేవించడం, అక్రమ రవాణా చేయటం, అక్రమ రవాణా చేసే వారికి సహకరించటం నేరమేనని, జైలు జీవితం గడపాల్సి వస్తుందని, గంజాయి వ్యాపారం ద్వారా సంపాదించిన ఆస్తులు ఎవరికన్నా ఉంటే ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని పేర్కొన్నారు.. అపరిచిత వ్యక్తులు, అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులు తమ గ్రామాలకు వస్తే తమకు సమాచారం అందించాలని కోరారు.అలాగే రోడ్డు భద్రత నియమాలు ప్రతి ఒక్కరు పాటించాలని కోరారు. రోడ్డు భద్రత నియమాలు పాటిస్తామని యువత, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సి ఐ గోపాలకృష్ణ,మహిళా పోలీస్ స్టేషన్ సి ఐ కన్నపరాజు తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు

## 'కంబాల శ్రీనివాసరావు'కు రాజ్ న్యూస్ బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డు (2026) ప్రధానం..!!

- సనాతన ధర్మ పరిరక్షణతో పాటు సమాజ సేవకు విశేషంగా కృషి చేస్తూ, పేద, నిరుపేదలకు అండగా నిలుస్తున్న
- రామసేన అధ్యక్షులు, భారతీయ జనతా పార్టీ నాయకులు కంబాల శ్రీనివాసరావు గారికి అరుదైన గౌరవం దక్కింది..!!
- మంత్రులు వై. సత్యకుమార్ యాదవ్, కందుల దుర్గేష్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ చేతులు మీదగా 'కంబాల' కు పురస్కారం..!





కోరుకొండ, సెప్టెంబర్ 4, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె) : రాజానగరం, జగ్గంపేట, రంపచోడవరం,నియోజకవర్గాల్లో ఆయన కొనసాగిస్తున్న విస్తృత సేవా కార్యక్రమాలను గుర్తించిన 'రాజ్ న్యూస్ తెలుగు ఛానల్' బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డు--2026లో భాగంగా సనాతన ధర్మ ప్రచారక్ సాంస్కృతిక పరిరక్షణ అవార్డు పురస్కారాన్ని ప్రదానం చేసింది. విజయవాడలోని 'ఎ' కన్వెన్షన్ హాల్‌లో గురువారం రాత్రి నిర్వహించిన అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్, పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ చేతులు మీదగా పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ....తన సేవలను గుర్తించి రాజ్ న్యూస్ బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డు (2026)లో భాగంగా సనాతన ధర్మ ప్రచారక్ సాంస్కృతిక పరిరక్షణ అవార్డు అందించడం ఎంతో సంతోషంగా, గర్వంగా ఉందన్నారు. ప్రజలే తనకు దేవుళ్లని, వారి కష్టాల్లో అండగా నిలవడం తన బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. ప్రజా సేవా కార్యక్రమాలను భవిష్యత్తులోనూ నిరంతరం కొనసాగిస్తానని స్పష్టం చేశారు.బి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్ఫూర్తితో రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టి, పేదలు, బడుగు బలహీన వర్గాలకు మరింతగా అండగా నిలుస్తానని కంబాల శ్రీనివాసరావు తెలిపారు.బి కంబాల శ్రీనివాసరావుకి అవార్డు లభించడంపై పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్నేహితులు, సన్నిహితులు, కుటుంబ సభ్యులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ప్రజా సేవలో ఆయన మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## ఇస్కాన్ టెంపుల్ లో బల్లా పల్లవి ప్రత్యేక పూజలు





అనంతపురం బ్యూరో సెప్టెంబర్ 04 నేటి శుభోదయ : అనంతపురం నగర సమీపంలో ఉన్న ఇస్కాన్ ఆలయాన్ని సందర్శించి శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా శ్రీకృష్ణుని ఆలయంలో మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ బల్లా పల్లవి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ కృష్ణుడి ఆశీస్సులతో మీ జీవితంలో సుఖశాంతులు , ఆయురారోగ్యాలు ఉండాలని ఆమె ఆకాంక్షించారు. రాజనీతిలో నేర్పు, ధర్మ పరిరక్షణలో ఓర్పు, దౌత్యంలో చాతుర్యం, స్నేహంలో నిబద్ధత, ఇవన్నీ తన జీవన పాఠాలుగా మార్చి లోకానికి మార్గదర్శనం చేసిన దేవకి సుతుడు శ్రీ కృష్ణుడు.. ఆయన ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కోరుకుంటూ ఆయన ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని చైర్పర్సన్ బల్లా పల్లవి దేవున్ని ప్రార్థించారు.

## కొట్టాలపల్లిలో అలరించిన 'విజన్' విద్యార్థుల సంబరాలు: ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు





యాడికి సెప్టెంబర్ 04 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : మండల పరిధిలోని కొట్టాలపల్లి గ్రామంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో, కోలాహలంగా జరిగాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని గ్రామంలో వెలసిన ప్రసిద్ధ రాధాకృష్ణ దేవాలయం నందు యాడికి పట్టణానికి చెందిన విజన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో శ్రీకృష్ణునికి ధూపదీప నైవేద్యాలు సమర్పించి భక్తిపారవశ్యంతో వేడుకలను ప్రారంభించారు. అనంతరం కొట్టాలపల్లి విజన్ స్కూల్ మరియు వేములపాడు విజన్ స్కూల్ విద్యార్థులు సంయుక్తంగా నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, విజ్ఞానదాయక యాక్టివిటీస్ చూపర్లను విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థులు ప్రదర్శించిన శ్రీకృష్ణాష్టమి జన్మదిన వృత్తాంతం స్కిట్లు, సాంస్కృతిక నృత్యాలు, వేషధారణలు, నాటికలు మరియు కృత్య ప్రదర్శనలు కార్యక్రమానికి ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. చిన్నారుల నటన, ప్రతిభను తిలకించిన ఆయా గ్రామాల తల్లిదండ్రులు, ప్రజలు ఎంతగానో మురిసిపోయి, విద్యార్థులలోని దాగిఉన్న నైపుణ్యాలను వెలికితీస్తున్న విజన్ స్కూల్ యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు మరియు కొట్టాలపల్లి యువత అందించిన పూర్తి సహాయ సహకారాలతో ఈ వేడుకలు అత్యంత దిగ్విజయంగా పూర్తయ్యాయి. సాంస్కృతిక కార్యక్రమాల అనంతరం కొట్టాలపల్లి రాధాకృష్ణ దేవాలయంలో ఏర్పాటు చేసిన భారీ అన్నదాన కార్యక్రమంలోఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో విజన్ స్కూల్ కరస్పాండెంట్ విశ్వనాథ్, ఉపాధ్యాయులు రాజశేఖర్, కొత్తరాయుడు, కోటి, ప్రసాద్, ఓబులేసు, నాగరాజు, మహిళా ఉపాధ్యాయురాళ్లు, విద్యార్థులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్



ఏలూరు, సెప్టెంబర్ 04, నేటి శుభోదయ : ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ నూతన క్యాంపు కార్యాలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుని ప్రతిమకు ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎంపీ కార్యాలయ సిబ్బంది, స్థానిక నాయకులు అందరికి సౌభాగ్యం, ఆనందం, ఆరోగ్యం, విజయాలు కలగాలని కోరుకుంటూ ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తరపున ఏలూరు పార్లమెంట్ ప్రజలకు శ్రీ కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు.

## శ్రీ కృష్ణాష్టమి మహోత్సవంలో ఎం పి అంబికా లక్ష్మీనారాయణ





అనంతపురం బ్యూరో సెప్టెం బర్ 4, నేటి శుభోదయ : అనం తపురం జిల్లా గుత్తి మండలంలో గుత్తి యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీకృష్ణాష్టమి పండుగ సందర్భంగా అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ శ్రీ కృష్ణాష్టమి మహోత్సవంలో పాల్గొన్నారు. యాదవ సంఘం నాయకులు, కమిటీ సభ్యులు అందించిన తీర్థప్రసాదాలను ఎంపీ అంబికా స్వీకరించారు. అనంతరం గుత్తి యాదవ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ చైర్మన్ వెంకట శివుడు యాదవ్ పాల్గొన్నారు. గుత్తి ప్రాంతంలో బీసీలు, యాదవులు అధిక సంఖ్యలో ఉన్న నేపథ్యంలో వారి అభివృద్ధికి మరింత ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉంది. యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్‌కు నా ఎంపీ నిధుల నుంచి రూ.50 లక్షలు కేటాయించి, నిర్మాణానికి సహకరిస్తామని తెలియజేశారు.గుత్తి ప్రాంత అభివృద్ధితో పాటు యాదవులు, బీసీల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి నా వంతు కృషి సహకారం ఉంటుందని తెలిపారు.శ్రీకృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా గుత్తి యాదవ సోదరులు, సోదరీమణులు, ప్రజలందరికీ హృదయపూర్వక శ్రీకృష్ణాష్టమి శుభాకాంక్షలు. ఈ కార్యక్రమంలో సీఐ కృష్ణయ్య మాజీ మార్కెట్ యార్డ్ శ్రీనివాస్ ఎక్స్-ఎన్‌పీటీసీ నరసింహులు సీనియర్ టీడీపీ నాయకులు ఏకాంతం సినీ రెడ్డి , పళ్ల సాంబశివయ్య , 108 శ్రీనివాసులు , ఆర్య కటిక చైర్మన్ హరికృష్ణ , పోస్టల్ శాఖ కృష్ణయ్య రైల్వే సత్యరామ్ , యాదవ సంఘం కమిటీ సభ్యులు కిష్టప్ప, పవన్, శీన, రామచంద్ర, స్థలదాత దడాల నారాయణ తదితరులు, యాదవ సంఘం నాయకులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## "వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలి

### వైసీపీ ఇంచార్జ్ వడ్డి రఘురామ్ నాయుడు"



తాడేపల్లిగూడెం సెప్టెంబర్ 4 (నేటి -శుభోదయ) తాడేపల్లిగూడెం రూరల్ మండలం పుల్లయిగూడెం గ్రామంలో డా.వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేశారు. విగ్రహం చేతులు, కాళ్ళను, తలను ధ్వంసం చేసి బీరు సీసాలను పెట్టారు. ఈ దుశ్చర్యను నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇంచార్జి వడ్డి రఘురామ్ నాయుడు తీవ్రస్థాయిలో ఖండించారు. విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ శ్రేణులు ఆందోళనకు దిగారు. విగ్రహానికి పాలాభిషేకం చేసి, దుండగులను అరెస్ట్ చేయాలని గ్రామంలో మెయిన్ రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా వడ్డి రఘురామ్ నాయుడు మాట్లాడుతూ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానాయకుడు వైయస్ రాజశేఖర్ రెడ్డి అని అన్నారు. ఉమ్మడి ఆంధ్రలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఆయన్ని అభిమానించే వారు కోట్లలో ఉన్నారన్నారు. రాజశేఖర్ రెడ్డిని ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారని ఆయన గుర్తుచేశారు.ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిన నాయకుడి విగ్రహాన్ని ఈ విధంగా ధ్వంసం చేయడం అత్యంత బాధాకరం అని వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పేదలు, రైతులు, విద్యార్థులు, మహిళలు, కార్మికులు, బలహీన వర్గాల సంక్షేమానికి అనేక కార్యక్రమాలను అమలు చేసి ప్రజల జీవితాల్లో చెరగని ముద్ర వేశారన్నారు. గ్రామంలో వైస్సార్ అభిమానులు రెండు రోజుల క్రితం వైఎస్సార్ వర్ధంతి చేశారని, దీంతో కొంతమంది దుండగులు ఓర్వలేక విగ్రహాన్ని అదేరోజు రాత్రి ధ్వంసం చేశారన్నారు. చేతులు, కాళ్ళు విరగ్గొట్టి బీరు బాటిల్స్ పెట్టారన్నారు.అటువంటి ప్రజా నాయకుడి విగ్రహాన్ని ధ్వంసం చేయడం కేవలం ఒక విగ్రహంపై జరిగిన దాడిగా కాకుండా, ప్రజల అభిమానాన్ని మరియు ప్రజాస్వామ్య విలువలను అవమానించే చర్యగా భావిస్తున్నామన్నారు.ఒక నాయకుడి విధానాలపై రాజకీయంగా విమర్శలు ఉండవచ్చు, భిన్నాభిప్రాయాలు ఉండవచ్చు కానీ ప్రజా ఆస్తులను, మహనీయుల విగ్రహాలను ధ్వంసం చేయడం మాత్రం ఏ విధంగానూ సమర్థనీయం కాదన్నారు. అత్యంత నీచంగా ప్రవర్తించారని, ఇది అత్యంత హేయమైన చర్య అన్నారు. ఇలాంటి పిరికిపంద చర్యలు మానుకోవాలన్నారు. జనసేన పోస్టర్ కు కన్నం పడితే కేసులు పెడుతున్న పోలీసులు ఇంత పెద్ద ఘటన జరిగితే పట్టించుకోకపోవడం దారుణమన్నారు.ఈ ఘటనకు ఎవరు బాధ్యులైనా వారిని వెంటనే గుర్తించి, పూర్తి స్థాయిలో విచారణ జరిపి, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. రాజకీయ ఒత్తిళ్లకు, వ్యక్తిగత ప్రయోజనాలకు తావులేకుండా నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలి ఘటనకు సంబంధించిన ఆధారాలను సేకరించి, బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసులు వెంటనే ఈ ఘటనపై కేసు నమోదు చేసి దాడి చేసిన దుండగులను అరెస్ట్ చేయాలన్నారు. లేకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా ధ్వంసమైన వైఎస్సార్ విగ్రహాన్ని వెంటనే పునరుద్ధరించి, పరిసర ప్రాంతాన్ని శుభ్రపరిచి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా తగిన భద్రతా చర్యలు చేపట్టాలన్నారు.విగ్రహం ఉన్న ప్రాంతంలో అవసరమైన లైటింగ్, సీసీ కెమెరాలు, భద్రతా ఏర్పాట్లు కల్పించడంతో పాటు ప్రజా ఆస్తుల పరిరక్షణకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం పట్టణ అధ్యక్షులు గొర్రెల శ్రీనివాస్, లంకా రాజశేఖర్, కండెల్లి రాజేష్, చిట్టూరి బాపన్న, ద్వారంపూడి కిరణ్ కుమార్ రెడ్డి, తానేటి అజయ్, కలిశెట్టి తాతారావు, రూరల్ నాయకులు,మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు,అభిమానులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## యాడికిలో అలరించిన శ్రీకృష్ణాష్టమి వేడుకలు: వాసవి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ



యాడికి సెప్టెంబర్ 04 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : పట్టణంలోని శ్రీశ్రీశ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి శాలలో శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రతి శుక్రవారం నిర్వహించే నిత్య పూజల్లో భాగంగా అమ్మవారికి షోడశోపచార పూజలు ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి శ్రీకృష్ణుని అలనాటి వేషధారణతో అలంకరించి ప్రత్యేక పూజలు సమర్పించారు. మహిళలందరూ భక్తిశ్రద్ధలతో పాల్గొన్న ఈ కార్యక్రమంలో రాధాకృష్ణులు, శ్రీకృష్ణుని విగ్రహాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నెమలి సింహాసనంపై వేంచేపు చేశారు. బొమ్మలు, కోలాటాలు, రకరకాల నానావిధ పుష్పాలతో దేవాలయ ప్రాంగణాన్ని కన్నులపండువగా అలంకరించారు. వేడుకల్లో భాగంగా చిన్నారులకు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలు వేయించి, సాంప్రదాయబద్ధంగా ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మహిళలు భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణ అష్టోత్తర శతనామావళి పఠించి, భక్తి పాటలు ఆలపించారు.యాడికి ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య మహిళా సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు బంగారు బాల, రాజేష్, పవన్, కమిటీ సభ్యులు మరియు ఆర్యవైశ్య బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు..

## నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన జి.గురు ప్రకాష్



( నేటి శుభోదయ న్యూస్ )ప్రతినిధి తిరువూరు సెప్టెంబర్ 4 ఎన్టీఆర్ జిల్లాతిరువూరు పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జి. గురుప్రకాశ్ శుక్రవారం గౌరవ శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావునివారికార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతన సీఐ గురుప్రకాశ్ కి శుభాకాంక్షలు తెలియజేసి, తిరువూరు నియోజకవర్గంలోశాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల భద్రత, నేరాల నియంత్రణ, ప్రజలకు సత్వర పోలీస్ సేవలు అందించడం వంటి అంశాలపై చర్చించారు.నియోజకవర్గంలో ప్రజలు ప్రశాంతమైన, సురక్షితమైన వాతావరణంలో జీవించేలా పోలీస్ శాఖ మరింత సమర్థవంతంగా పనిచేయాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ప్రజలు తమ సమస్యలను ధైర్యంగా పోలీస్ శాఖ దృష్టికి తీసుకువచ్చే విధంగా స్నేహపూర్వక పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని సూచించారు.అదేవిధంగా తిరువూరు నియోజకవర్గంలోని ప్రస్తుతపరిస్థితులుశాంతిభద్రతలకుసంబంధించిన అంశాలు ప్రజా సమస్యలపై పోలీస్ శాఖ స్పందన. తదితర విషయాలపై అధికారులతో ఎమ్మెల్యే కాసేపు చర్చించారు. ఈ సమావేశంలో మైలవరం ఏసీపీ శ్రీ రామచంద్రరావు,సబ్ ఇన్స్పెక్టర్లు శాతకర్ణి రాజు

## శ్లోకాల పోటీల్లో శ్రీనిధి స్కూల్ విద్యార్థుల ప్రతిభ

### మండల స్థాయి పోటీల్లో ప్రథమ, తృతీయ స్థానాలు కైవసం



( నేటి శుభోదయ న్యూస్) ప్రతినిధి తిరువూరు సెప్టెంబర్ 4 ఎన్టీఆర్ జిల్లా సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన శ్లోకాల పోటీల్లో శ్రీనిధి స్కూల్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. మండల స్థాయిలో నిర్వహించిన పోటీల్లో ఐదో తరగతికి చెందిన షేక్ సుహానా ప్రథమ స్థానం, నందకిషోర్ తృతీయ స్థానం సాధించి పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు.విజేతలకు డి.వై.ఓ. శ్యామసుందర్‌రావు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ ఎం. కిషోర్ బాబు, ప్రిన్సిపల్ ఆర్. వెంకట నారాయణ, హైస్కూల్ ఇన్‌చార్జ్ సుబ్బారావు, ప్రైమరీ ఇన్‌చార్జ్ పద్మావతితో పాటు ఉపాధ్యాయులుఅభినందిం చారు.విద్యార్థుల్లో ఆధ్యాత్మిక, సాంస్కృతిక విలువలనుపెంపొందించేందుకు ఇలాంటి పోటీలుఎంతగానోదోహదపడతాయని పాఠశాలయాజమాన్యంపేర్కొంది.భవిష్యత్తులోనూ విద్యార్థులు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## శ్రీకృష్ణాష్టమి వేడుకలతో సందడిగా న్యూటన్ ఇంజినీరింగ్ కళాశాల





మాచర్ల రూరల్, సెప్టెంబర్ 4 (నేటి శుభోదయం): పల్నాడు జిల్లాలోని న్యూటన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఉట్టి కొట్టి కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని ఉట్టి కొట్టి వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. విద్యార్థుల కేరింతలు, సందడితో కళాశాల ప్రాంగణం పండగ వాతావరణాన్ని సంతరించుకుంది. కార్యక్రమంలో కళాశాల సీనియర్ కార్యదర్శి, అకడమిక్ డైరెక్టర్, ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్, అడ్మినిస్ట్రేటివ్ అధికారులు, వివిధ విభాగాల హెచ్‌వోడీలు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ ద్వారా విద్యార్థుల్లో భారతీయ సంప్రదాయాలు, సాంస్కృతిక విలువల పట్ల అవగాహన పెంపొందుతుందని కళాశాల యాజమాన్యం పేర్కొంది. విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ విద్యార్థులు చురుకుగా పాల్గొనడం అభినందనీయమని తెలిపారు.

## బీసీవై నేత బోడె రామచంద్ర యాదవ్ ను కలిసిన దళిత నేతలు



గుడివాడ, సెప్టెంబర్ 4 నేటి శుభోదయ: కృష్ణాష్టమి సందర్భంగా గుడివాడ వచ్చిన బీసీవై పార్టీ అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ నెహ్రూ చౌక్ సెంటర్లో దళిత సంఘాల నేతలతో కలిసి డాక్టర్ బాబా అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం పంతగాని సురేష్ రామచంద్ర యాదవ్ తో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వము అధికారము లోకి వచ్చిన తర్వాత కేవలం దళితుల పైన దాడులు హత్యలు జరుగుతున్నాయని, గుడివాడ నియోజకవర్గంలో జరగబోయే మున్సిపల్ మున్సిపల్ ఎలక్షన్లో చైర్మన్ అభ్యర్థిగా దళితులకు అవకాశం కల్పించాలని కోరగా మనమందరం కలిసి పోరాటం చేద్దామని అతి త్వరలోనే మిమ్మల్ని అందరిని కలుస్తానని పేర్కొన్నారన్నారు. ఈ కార్యక్రమములో దళిత సంఘాల నేతలు పొంగిలేటి జయరాజు,దారం కరుణాకర్, శిష్టా పూర్ణ, నరసింహారావు కోటే చిన్నా తదితరులు పాల్గొన్నారు

## రూపా నగర్‌లో ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు..!

**- ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన శ్రీమతి బత్తుల వెంకటలక్ష్మి..**





కోరుకొండ, సెప్టెంబర్ 4, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె) : రూపా నగర్‌లో శ్రీ కృష్ణాష్టమి పర్వదిన వేడుకలు స్థానిక ప్రజలు, భక్తుల సమక్షంలో అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక ఉత్సాహంతో నిర్వహించారు. ఈ వేడుకల్లో రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ సతీమణి, జనసేన పార్టీ 'నా సేన కోసం నా వంతు' రాష్ట్ర కమిటీ కో-ఆర్డినేటర్ శ్రీమతి బత్తుల వెంకటలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు. శ్రీ కృష్ణ జన్మాష్టమి ని పురస్కరించుకుని వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు. శ్రీమతి బత్తుల వెంకటలక్ష్మి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మంగళ హారతులు అర్పించారు. అనంతరం ఆలయంలో అమ్మవారిని దర్శించారు. ఈ సందర్భంగా శ్రీమతి బత్తుల వెంకటలక్ష్మి మాట్లాడుతూ..శ్రీ కృష్ణ పరమాత్ముని బోధనలు, ధర్మ పరిరక్షణ మార్గం నిత్యం ఆచరణీయం. సమాజంలో మంచి, ధర్మం వర్ధిల్లాలని, శ్రీ కృష్ణుని దివ్య ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుకుంటున్నానన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.

### ఇంద్రకీలాద్రిపై వైభవంగా

# 'సామూహిక వరలక్ష్మీ వ్రతాలు'



విజయవాడ, సెప్టెంబర్ 4 (నేటి శుభోదయ):- శ్రావణ మాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీ మల్లికార్జున మహా మండపంలో నిర్వహించిన 'సామూహిక వరలక్ష్మీ వ్రతాలు' అత్యంత వైభవంగా జరిగాయి.?ఆలయ వేద పండితులు, అర్చకుల మంత్రోచ్చారణల మధ్య ఉదయం 7:00 గంటల నుండి 9:00 గంటల వరకు మొదటి విడతగా 'ఆర్జిత సేవ' రూపంలో, అనంతరం ఉదయం 10:00 గంటల నుండి 11:30 గంటల వరకు రెండవ విడతగా 'ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతం' శాస్త్రోక్తంగా నిర్వహించబడ్డాయి. ఆర్థిక స్తోమతతో సంబంధం లేకుండా నిరుపేద మహిళలు కూడా అమ్మవారి సన్నిధిలో వ్రతం ఆచరించేలా దేవస్థానం చేపట్టిన చొరవతో 600 మందికి పైగా మహిళలు ఉచిత సామూహిక వ్రతంలో పాల్గొన్నారు. వ్రతంలో పాల్గొన్న ప్రతి ఒక్క మహిళకు అవసరమైన పూజా సామగ్రిని దేవస్థానమే ఉచితంగా సమకూర్చింది. వ్రతం ముగిసిన అనంతరం పసుపు-కుంకుమలు, రవికె వస్త్రం, గాజులు, శ్రీ అమ్మవారి ప్రసాదాలను అందజేయడంతో పాటు ప్రత్యేక క్యూ లైన్ ద్వారా శ్రీ కనకదుర్గమ్మ ఉచిత దర్శన భాగ్యాన్ని కల్పించారు. దేవస్థానం చేసిన ఏర్పాట్లపై మహిళా భక్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సామూహిక పూజల్లో దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ సతీమణి శ్రీమతి అంజలి సామాన్య మహిళలతో కలిసి భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించారు. అనంతరం బొర్రా రాధాకృష్ణ, ఈవో వి.కె. శీనా నాయక్ మహా మండపానికి విచ్చేసి వరలక్ష్మీ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఈవో వి.కె. శీనా నాయక్ మాట్లాడుతూ "ధనిక, పేద అనే తేడా లేకుండా భక్తులందరికీ అమ్మవారి దివ్య సేవలో భాగస్వామ్యం కల్పించాలనే సమున్నత లక్ష్యంతో మొదటి విడత ఆర్జిత సేవగా, రెండో విడతలో 600 మందికి పైగా మహిళలకు ఉచితంగా సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించామని. సనాతన ధర్మ పరిరక్షణకు, హిందూ ధర్మ ప్రచారానికి, భారతీయ సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణకు ఇటువంటి సామూహిక ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయి" అని పేర్కొన్నారు.?ఈ కార్యక్రమంలో స్థానాచార్య వి. శివ ప్రసాద్ శర్మ,వైదిక కమిటీ సభ్యులు వి. శ్రీధర్ శర్మ,ఫెస్టివల్ సహాయ కార్యనిర్వహణాధికారి డాక్టర్ కె. గంగాధర్,పర్యవేక్షకులు హేమ దుర్గాంబ , సీనియర్ అసిస్టెంట్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

## ఇంద్రకీలాద్రిపై ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**- ఆశీర్వచన మండపంలో శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు**



విజయవాడ, సెప్టెంబర్ 4 (నేటి శుభోదయ): శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో శుక్రవారం ఉదయం శ్రీకృష్ణ పూజా మహోత్సవాలు శాస్త్రోక్తంగా నిర్వహించబడ్డాయి. ఉదయం 8:00 గంటలకు ప్రధానాలయం ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో వేద పండితులు, అర్చకుల మంత్రోచ్చారణల నడుమ శ్రీకృష్ణ భగవానునికి విశేష పూజలు,పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో వి.కె. శీనా నాయక్, ఆలయ స్థానాచార్యులు పాల్గొని పూజలు జరిపించారు. శ్రీకృష్ణ జన్మాష్టమి పురస్కరించుకుని ఆలయ చిన్న రాజగోపురం సమీపంలో దేవస్థానం ఆధ్వర్యంలో పవిత్ర గోపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో వి.కె. శీనా నాయక్ పాల్గొని గోమాతకు పసుపు-కుంకుమలు సమర్పించి పూజలు చేశారు. అనంతరం గోవులకు స్వయంగా గ్రాసం తినిపించి ఆశీస్సులు అందుకున్నారు. సనాతన ధర్మంలో గోసంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఉందని, శ్రీకృష్ణావతార విశిష్టతను చాటుతూ ప్రతి ఒక్కరూ గోసేవను కర్తవ్యంగా భావించాలని ఈ సందర్భంగా ఈవో పేర్కొన్నారు. ఈ పూజా కార్యక్రమాలలో స్థానాచార్యులు పాల్గొన్నారు.

### కోడి పందేల జూద శిబిరంపై

# పోలీసుల మెరుపు దాడి!

**ముగ్గురు అరెస్ట్.. రూ.7,420 నగదు, కోడి పుంజు స్వాధీనం**

( నేటి శుభోదయ న్యూస్ )ప్రతినిధి సెప్టెంబర్ 4 ఎన్టీఆర్ జిల్లా తిరువూరు తిరువూరు మండలం అక్కపాలెం గ్రామ శివారులో కోడి పందేల పేరుతో సాగుతున్న జూద శిబిరంపై తిరువూరు పోలీసులు మెరుపు దాడి నిర్వహించారు. విశ్వసనీయ రహస్య సమాచారం మేరకు తిరువూరు పోలీస్ స్టేషన్ ఎస్ఐ శాతకర్ణి తన సిబ్బందితో కలిసి శుక్రవారం మధ్యాహ్నం ఆకస్మికంగా దాడి చేశారు. ఈ దాడిలో ఆంధ్రప్రదేశ్ గేమింగ్ చట్టానికి విరుద్ధంగా నగదు పణంగా కోడి పందేలు నిర్వహిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.7,420 నగదు, ఒక కోడి పుంజును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను చట్టబద్ధంగా అరెస్టు చేసి, వారిపై ఆంధ్రప్రదేశ్ గేమింగ్ చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఘటనపై పోలీసులు తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

**జూదాలకు దూరంగా ఉండాలి: పోలీసులు**

ప్రభుత్వం నిషేధించిన జూద కార్యకలాపాల్లో పాల్గొనడం చట్టరీత్యా నేరమని పోలీసులు హెచ్చరించారు. జూదం వల్ల కుటుంబాల ఆర్థిక




పరిస్థితులు దెబ్బతినడంతో పాటు, సామాజిక శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉందన్నారు.జూదకార్యకలాపాలకు పాల్పడినా, నిర్వహించినా కఠిన చర్యలు తప్పవని పోలీసులు స్పష్టం చేశారు. ప్రజలు ఇటువంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు ఎస్సై శాతకర్ణి.

# శ్రీ కనకదుర్గమ్మ వారికి స్వర్ణాభరణాలు సమర్పించిన భక్తురాలు



విజయవాడ, సెప్టెంబర్ 4 (నేటి శుభోదయ): ఇంద్రకీలాద్రిపై ఉన్న జగన్మాత శ్రీ కనకదుర్గమ్మ వారికి శ్రావణ మాసం చివరి శుక్రవారం పురస్కరించుకుని భక్తులు భక్తిశ్రద్ధలతో స్వర్ణ కానుకలను సమర్పించారు. విజయవాడ, బ్యాంక్ కాలనీకి చెందిన భక్తురాలు శ్రీమతి గుంటుపల్లి శ్రీ ప్రణవి శుక్రవారం దేవస్థాన కార్యాలయానికి విచ్చేసి శ్రీ అమ్మవారి మూలవిరాట్ అలంకరణ నిమిత్తం సుమారు 22.800 గ్రాముల బంగారు ఆభరణాలను కానుకగా చైర్మన్ బొర్రా రాధాకృష్ణ సమక్షంలో అందజేశారు. బంగారు బొట్టు (నవరత్నాలు, డైమండ్స్ పొదిగినది), బంగారు నత్తు (డైమండ్స్, ఎరుపు ఉ పచ్చ రాళ్లు పొదిగినది), బంగారు బులాకి (డైమండ్స్, ఎరుపు ఉ పచ్చ రాళ్లు, ముత్యం పొదిగినది). దేవస్థాన అధికారులు ఆలయ నిబంధనల ప్రకారం ఆభరణాలను స్వీకరించి రశీదును అందజేసి, దాతకు శ్రీ అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వేద పండితులు వేదాశీర్వచనం అందజేసి, అమ్మవారి చిత్రపటాన్ని, శేషవస్త్రాలను, లడ్డు ప్రసాదాలను అందజేశారు.

# రానున్న మున్సిపల్ ఎన్నికలపై శాఖాధిపతులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన వియంసి కమిషనర్ ధ్యానచంద్ర



విజయవాడ, సెప్టెంబర్ 4 (నేటి శుభోదయ): విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర శుక్రవారం ఉదయం నగరపాలక సంస్థ శాఖాధిపతులతో రానున్న మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లపై టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అదనపు కమిషనర్ జనరల్‌ను నోడల్ అధికారిగా నియమించగా, అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. గత మున్సిపల్ ఎన్నికల్లో అనుసరించిన విధానాలను పరిశీలించి, అవసరమైన మేరకు ఈ ఎన్నికల్లో కూడా సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. జణహీూ వారు కోర్టు ప్రొసీడింగ్స్ అమలు చేయాలని ఆదేశించగా వాటిని క్షుణ్ణంగా పరిశీలించి, ఆదేశాలకు అనుగుణంగా వార్డుల డీలిమిటేషన్ ప్రక్రియను పూర్తి చేసి, తదనంతర చర్యలను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. డీలిమిటేషన్ ప్రక్రియ అనంతరం ప్రతి వార్డులో ఏర్పాటు చేయాల్సిన పోలింగ్ కేంద్రాలను ముందుగానే గుర్తించాలని, పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం, ర్యాంపులు తదితర సౌకర్యాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అలాగే ప్రతి పోలింగ్ కేంద్రానికి సంబంధించిన ఓటర్ల సంఖ్య, ఇతర అవసరమైన వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో నగరపాలక సంస్థకు చెందిన ప్రతి శాఖకు బాధ్యత ఉంటుందని కమిషనర్ స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియలో అప్పగించిన బాధ్యతలను అధికారులు సమర్థవంతంగా నిర్వహిస్తూ, పరస్పర సమన్వయంతో పనిచేసి మున్సిపల్ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలని ఆదేశించారు.

# భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**- పలు డివిజన్లలోని శ్రీకృష్ణ ఆలయాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బొండా ఉమా**





విజయవాడ, సెప్టెంబర్ 4 (నేటి శుభోదయ): శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని సెంట్రల్ లోని 27, 29, 31, 57, 59, 60 డివిజన్లలోని శ్రీకృష్ణ దేవాలయాల్లో శుక్రవారం నిర్వహించిన జన్మాష్టమి వేడుకల్లో ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీకృష్ణ పరమాత్ముని దర్శించుకుని స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు. ఆలయ నిర్వాహకులు బొండా ఉమా కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఉమా మాట్లాడుతూ ముందుగా నియోజకవర్గ ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలందరికీ శ్రీకృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా శ్రీకృష్ణ భక్తులు భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొంటున్నారని, భారతదేశంలో ప్రతి ఇంటా శ్రీకృష్ణ పరమాత్మునికి పూజలు, భజనలు నిర్వహిస్తూ ఈ పవిత్ర పర్వదినాన్ని జరుపుకుంటున్నారని తెలిపారు. శ్రీకృష్ణ పరమాత్ముడు భగవద్గీత ద్వారా అందించిన సందేశాలు, బోధనలు ప్రతి ఒక్కరి జీవితానికి మార్గదర్శకంగా నిలుస్తాయని ఉమా అన్నారు. ధర్మాన్ని ఆచరించడం, సత్యం, న్యాయం, మంచితనం వైపు నడవడం, కర్తవ్యాన్ని నిబద్ధతతో నిర్వర్తించడం వంటి విలువలను భగవద్గీత మనకు బోధిస్తుందని పేర్కొన్నారు. శ్రీకృష్ణుడి బోధనలను మన జీవితాల్లో ఆచరిస్తూ మంచి సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ శ్రీకృష్ణ పరమాత్ముని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, శాంతి సౌభాగ్యాలతో జీవించాలని ఉమా ఆకాంక్షించారు, ప్రజలందరికీ శ్రీకృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో మాజీ కార్పొరేటర్ లు కాకు మల్లిఖార్జున యాదవ్, ఎరుబోతు రమణ రావు, కూటమి నాయకులు, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

# పరిశుభ్రత ప్రమాణాలు పాటించని హోటళ్లకు జరిమానాలు

**లోపాలను సరిదిద్దకుంటే తదుపరి చర్యలు తప్పవు**



విజయవాడ, సెప్టెంబర్ 4 (నేటి శుభోదయ): విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు, శుక్రవారం ఉదయం ప్రజారోగ్య విభాగం అధికారులు 37వ డివిజన్ పరిధిలోని కెనాల్ రోడ్ ప్రాంతంలో పలు హోటళ్లను తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో భాగంగా కెనాల్ రోడ్ ప్రాంతంలోని స్వీట్ మ్యాజిక్, తాజ్ హోటల్, హోటల్ సాయి సరోవర్, మంగమ్మ కిచిడీ సెంటర్‌లను అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా హోటళ్లలోని వంటగదులను పరిశీలించగా, కిచెన్ గదులకు టైల్స్ లేకపోవడం, గోడలు, ఇతర ప్రదేశాల్లో బూజు ఏర్పడటం, గోడలు అపరిశుభ్రంగా ఉండటం, ఆహార పదార్థాలను మూతలు లేకుండా నిల్వ చేయడం, నిల్వ ఉన్న ఆహార పదార్థాలను గుర్తించడం, పరిసరాల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొని ఉండటం వంటి పలు లోపాలు గుర్తించారు. అదేవిధంగా, నాణ్యమైన తాగునీటిని వినియోగించకపోవడం, మరుగుదొడ్లు సరిపడా లేకపోవడం, ఉన్న మరుగుదొడ్లను సక్రమంగా నిర్వహించకపోవడం, పరిశుభ్రత ప్రమాణాలను పాటించకుండా అపరిశుభ్ర వాతావరణంలో ఆహార పదార్థాల తయారీ, విక్రయాలు నిర్వహించడం వంటి అంశాలను అధికారులు గుర్తించారు. ప్రజారోగ్యానికి విఘాతం కలిగించే విధంగా అపరిశుభ్ర పరిస్థితుల్లో హోటల్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నందుకు సంబంధిత మూడు హోటళ్లకు ఒక్కొక్కదానికి రూ.5,000 చొప్పున జరిమానా విధించి నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందుకున్న హోటల్ యాజమాన్యాలు నిర్ణీత గడువులోగా గుర్తించిన లోపాలను పూర్తిస్థాయిలో సరిదిద్దుకోవాలని, పరిశుభ్రత, ప్రజారోగ్య నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు ఆదేశించారు. నిర్ణీత గడువులోగా లోపాలను సరిచేయని పక్షంలో సంబంధిత యాజమాన్యాలపై చట్టప్రకారం తదుపరి చర్యలు చేపట్టడంతో పాటు, అవసరమైతే ట్రేడ్ లైసెన్సులను రద్దు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్లు, ఆహార విక్రయ కేంద్రాల నిర్వాహకులు పరిశుభ్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నాణ్యమైన ఆహారం మరియు సురక్షితమైన తాగునీటిని ప్రజలకు అందించాలని అధికారులు సూచించారు. ఈ తనిఖీలలో సర్కిల్--1 శానిటరీ సూపర్‌వైజర్ డి. సోమరాజు, శానిటరీ ఇన్స్పెక్టర్లు బి. యోగేంద్ర కుమార్, ఎం. రవిశంకర్, ప్రజారోగ్య విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

# రామలింగేశ్వర నగర్ ఇస్కాన్ ఆలయంలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు పాల్గొన్న ఎంపీ కేశినేని చిన్ని



విజయవాడ, సెప్టెంబర్ 4 (నేటి శుభోదయ): రామలింగేశ్వర నగర్‌లోని ఇస్కాన్ ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎంపీ కేశినేని శివనాథ్ చిన్ని, టిడిపి సీనియర్ నాయకులు బొప్పన భవకుమార్ తదితరులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా, దేశవ్యాప్తంగా ప్రజలు కృష్ణాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారని తెలిపారు. శ్రీకృష్ణుడి జన్మదినాన్ని పురస్కరించుకుని ఇస్కాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు, భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. శ్రీకృష్ణుడి బోధనలు మానవాళికి శాంతి, ధర్మం, సత్యం, కర్తవ్యనిష్ఠ వంటి విలువలను అందిస్తున్నాయని ఎంపీ అన్నారు. భగవద్గీత ద్వారా శ్రీకృష్ణుడు సమాజానికి అందించిన సందేశాలు నేటికీ ప్రతి ఒక్కరికీ మార్గదర్శకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. కృష్ణాష్టమి వంటి పండుగలు మన ఆధ్యాత్మిక సంప్రదాయాలను, సంస్కృతిని, కుటుంబ విలువలను భావితరాలకు అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఎంపీ తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో టెంపుల్ టూరిజం అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని ఎంపీ శివనాథ్ తెలిపారు. రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాలు, ఆధ్యాత్మిక క్షేత్రాలు, పుణ్యస్థలాలను మరింత అభివృద్ధి చేసి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ఆధ్యాత్మిక కేంద్రాలను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయడం ద్వారా భక్తులకు సౌకర్యాలు కలగడమే కాకుండా, స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని ఎంపీ పేర్కొన్నారు. ఆలయాల అభివృద్ధి, పరిసరాల పరిశుభ్రత, భక్తుల సౌకర్యాలు, మౌలిక వసతుల కల్పన వంటి అంశాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. సంప్రదాయాలను కాపాడుతూ పండుగల నిర్వహణ హిందువుల పండుగలను సంప్రదాయబద్ధంగా జరుపుకునేలా ప్రభుత్వం సెలవులు కూడా ఇస్తోందని ఎంపీ అన్నారు. మన పండుగలు కేవలం ఆచారాలు మాత్రమే కాకుండా, సమాజాన్ని ఒక్కతాటిపైకి తీసుకువచ్చే సాంస్కృతిక వేడుకలని పేర్కొన్నారు. కృష్ణాష్టమి సందర్భంగా చిన్నారులు, యువత, మహిళలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి కార్యక్రమాలను నిర్వహించడం ఆనందంగా ఉందని అన్నారు. ఇలాంటి వేడుకల ద్వారా మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలు మరింత బలపడతాయని తెలిపారు. కృష్ణాష్టమి వంటి పండుగలు ప్రజల్లో ఐక్యతను పెంచుతాయని ఎంపీ చిన్ని అన్నారు. కులమత భేదాలకు అతీతంగా ఊరు, వాడా కలిసి అందరూ ఇలాంటి పండుగలను జరుపుకోవాలని పిలుపునిచ్చారు. పండుగల సమయంలో పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకోవడం, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం, సమాజ శ్రేయస్సు కోసం కలిసి పనిచేయడం ద్వారా సోదరభావం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలందరూ శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో పండుగలను జరుపుకోవాలని కోరారు. భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం కృషి పండుగల సందర్భంగా భక్తులకు అవసరమైన సదుపాయాలు, సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీ తెలిపారు. ఆలయాల వద్ద భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు, పరిశుభ్రత, తాగునీరు, ఇతర అవసరమైన సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు, భక్తులు, ప్రజలు సహకరించాలని ఎంపీ కోరారు. భక్తి, సంస్కృతి, సేవాభావంతో నిర్వహించే ఇలాంటి కార్యక్రమాలు సమాజానికి ఎంతో మేలు చేస్తాయని అన్నారు. ఆ శ్రీకృష్ణుడి ఆశీస్సులతో ప్రతి ఒక్క కుటుంబం సుఖ సంతోషాలతో ఉండాలని ఎంపీ చిన్ని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో సీనియర్ టిడిపి నాయకులు బొప్పన భవకుమార్, మాజీ కార్పొరేటర్ బహదూర్, టిడిపి సీనియర్ నాయకులు కరీముల్లా, చరణ్ సాయి యాదవ్, ఇస్కాన్ టెంపుల్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఊర్మిళానగర్‌లో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**పాల్గొన్న మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు**



విజయవాడ, సెప్టెంబర్ 4 (నేటి శుభోదయ): శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని విజయవాడ పశ్చిమలోని ఊర్మిళానగర్‌లో శ్రీకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో జన్మాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో మాజీ మంత్రి, పశ్చిమ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా శ్రీకృష్ణ భగవానుడిని దర్శించుకున్న ఆయన, వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ అన్నదాన కార్యక్రమాన్ని వెలంపల్లి ప్రారంభించారు. భక్తులకు స్వయంగా అన్నప్రసాదాలను వడ్డించి వారిని ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ భగవద్గీత ద్వారా మానవాళికి ధర్మమార్గాన్ని చూపిన శ్రీకృష్ణ పరమాత్ముని జీవితం అందరికీ ఆదర్శప్రాయమని అన్నారు. సమాజంలో ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం కంటే మిన్నయైన సేవ మరొకటి లేదని, పండుగ వేళ ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. భగవంతుని ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణ సేవా సమితి నిర్వాహకులు, మాజీ కార్పొరేటర్ కోటిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీకృష్ణుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి

## - దేవాలయ అభివృద్ధికి ఎమ్మెల్యే లక్ష 17 వేల రూపాయలు విరాళాన్ని అందజేత



విజయవాడ, సెప్టెంబర్ 4 (నేటి శుభోదయ): 64వ డివిజన్ కుందావారి కండ్రికలో శ్రీకృష్ణ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సెంట్రల్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బొండా ఉ మామహేశ్వరరావు హాజరై శ్రీకృష్ణుడిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినం భక్తులకు ఎంతో పవిత్రమైనదని, ధర్మాన్ని కాపాడుతూ ప్రజలకు సత్యం, న్యాయం, ధర్మం వైపు నడవాలని శ్రీకృష్ణుడి బోధనలు మనకు మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు. శ్రీకృష్ణుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి ఇంట్లో శ్రీకృష్ణ పరమాత్ముని ఆశీస్సులు పొందేందుకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో సందడి చేస్తూ మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తున్నారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో యాదవ సోదరులు, యాదవ పెద్దల ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. తాను గతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పటి నుంచి సెంట్రల్ లోని శ్రీకృష్ణుని దేవాలయాల్లో నిర్వహించే కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొంటూ వస్తున్నానని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలతో మమేకమై శ్రీకృష్ణ పరమాత్ముని గీతా సారాన్ని, గీతాబోధనలోని మంచి సందేశాలను ప్రతి ఒక్కరికీ అందించేందుకు కృషి చేస్తున్నామని ఉమా అన్నారు. కుందావారి కండ్రికలో నిర్వహించిన శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొని శ్రీకృష్ణ పరమాత్మునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ అభివృద్ధికి పార్టీ నాయకులు, స్థానిక పెద్దల సహకారంతో రూ. 1.17 లక్షల విరాళాన్ని అందజేశారు. దేవాలయ అభివృద్ధికి, స్థానికంగా నిర్వహించే ధార్మిక కార్యక్రమాలకు తమ పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. స్థానిక పెద్దలు, దేవాలయ కమిటీ సభ్యులు, నాయకులు అందించే సూచనలు, సలహాలను పాటిస్తూ వారి ఆధ్వర్యంలో జరిగే ప్రతి కార్యక్రమానికి అండగా ఉంటామని, శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ప్రజలకు, రాష్ట్ర ప్రజలందరికీ ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. శ్రీకృష్ణ పరమాత్ముని ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణ ఆలయ కమిటీ సభ్యులు పిన్నిబోయిన ఏడుకొండలు, గొర్రిపర్తి హన్మంతరావు, సాధం జామలయ్య, మండల బుల్లిబాబు, నిలపాల పొంగయ్య, 64వ డివిజన్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కాకొల్లు రవికుమార్, ,రాజా బ్యాంక్ చైర్మన్ సాధం శ్రీనాథ్, డైరెక్టర్ పొన్నం శేషగిరి, దేవిరెడ్డి చంద్రశేఖర్, తెలుగుదేశం పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఆపదలో ఉన్న పేద కుటుంబానికి అండగా నిలిచేది కూటమి ప్రభుత్వమే

## -పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్



పెనమలూరు, సెప్టెంబర్ 4 నేటి శుభోదయ : ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం, పేద కుటుంబాలకు వైద్య సహాయాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటోందని పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ. 7.09 లక్షల విలువైన ఎల్ ఓ సి పత్రాలను ఐదుగురు లబ్ధిదారులకు అందచేసిన అనంతరం మాట్లాడుతూ అనారోగ్యం కారణంగా ఏ పేద కుటుంబం కూడా అప్పుల ఊబిలో చిక్కుకోకూడదని, డబ్బుల్లేక చికిత్స ఆగిపోకూడదని ,అదే ఆలోచనతో సీఎం చంద్రబాబు నాయుడు సీఎం రిలీఫ్ ఫండ్‌ను మరింత వేగవంతంగా, పారదర్శకంగా అమలు చేస్తున్నారని అన్నారు.,అర్హులైన ప్రతి కుటుంబానికి సకాలంలో ఆర్థిక సహాయం అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. పెనమలూరు నియోజకవర్గంలో ఇప్పటివరకు వందలాది కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వైద్య సహాయం అందించి,వారి జీవితాల్లో కొత్త ఆశలు నింపామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలకు అవసరం వచ్చిన ప్రతిసారీ వారి పక్షాన నిలబడి సేవ చేయడమే ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రజల కష్టాల్లో తోడుగా నిలిచే ప్రభుత్వం, అవసరమైన సమయంలో ఆదుకునే నాయకత్వమని, సంక్షేమాన్ని చేతల్లో చూపిస్తున్న కూటమి ప్రభుత్వమని అన్నారు. ప్రాణాలను కాపాడే పాలన ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేదే కూటమి ప్రభుత్వం అన్నారు. ఈ కార్యక్రమంలో తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షులు అనుమోలు ప్రభాకర్ రావు, రాష్ట్ర గౌడ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరామ ప్రసాద్ గౌడ్, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పీత గోపీచంద్, మండల పార్టీ అధ్యక్షులు కోయ ఆనంద ప్రసాద్, పాల్గొన్నారు.

# ఆర్.జే. రత్నాకర్ జన్మదిన వేడుకలకు హాజరైన మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి





అనంత పురం బ్యూరో సెప్టెంబర్ 04 నేటి శుభోదయ : సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ శ్రీ ఆర్.జే. రత్నాకర్ జన్మదిన వేడుకలు పుట్టపర్తిలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి హాజరై రత్నాకర్‌కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ రత్నాకర్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్ళు జీవించాలని, సత్యసాయి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తూ సమాజానికి మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. అనంతరం రత్నాకర్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన అభిమానులు జానకి రామయ్య కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన అన్నవితరణ కార్యక్రమంలో శ్రీ రత్నాకర్‌తో కలిసి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు.

భక్తులు, అభిమానులు , ప్రజలకు అన్నప్రసాద వితరణ చేశారు. అంతకుముందు శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని గోకులంలో నిర్వహించిన ప్రత్యేక వేడుకల్లో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జే. రత్నాకర్, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణునికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎల్ఈ కార్యక్రమాల్లో రత్నాకర్ అభిమానులు, కూటమి పార్టీల నాయకులు గంగాధర నాయుడు, సామకోటి ఆదినారాయణ, తోట గంగాధర్, కృష్ణ ప్రసాద్, జయప్రకాష్, బేకరి నాయుడు, గంగాధర్, సురేష్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి బాక్సింగ్ లో సంహిత కళాశాల విద్యార్థి ప్రతిభ..!



కోరుకొండ, సెప్టెంబర్ 4, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె) : రాజమహేంద్రవరం సంహిత డిగ్రీ కళాశాలలో బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ ఫైనల్ ఇయర్ చదువుతున్న ఏ. వీర వినయ్ బాక్సింగ్ క్రీడలో విశేష ప్రతిభ కనబరిచారు. ఆగస్టు 24 నుంచి 27 వరకు అమరావతిలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఛాంపియన్ షిప్ -2026 లో బాక్సింగ్ అండర్ 23 విభాగంలో 55-60 కేజీల విభాగంలో పాల్గొని రన్నర్ గా నిలిచారు. బాక్సింగ్ లో ప్రతిభ కనబరిచిన వినయ్ ను డైరెక్టర్ కర్రీ బాగ్యర్క సిన్హా, ప్రిన్సిపల్ తోట రామకృష్ణ, ఇతర అధ్యాపకులు అభినందించారు. ఏ. వీర వినయ్ భవిష్యత్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# ఎ.పి. రివర్స్ బయర్ సెల్లర్ మీట్ ని సద్వినియోగం చేసుకోండి

## ఎమ్.ఎస్.ఎం.ఇ. లకు ఎమ్మెల్యే గద్దె పిలుపు



విజయవాడ, సెప్టెంబర్ 4 (నేటి శుభోదయ): ఈ నెల 7,8 తేదీలలో విజయవాడ నోవోటెల్ హోటల్లో జరగనున్న 'ఎ.పి. రివర్స్ బయర్ సెల్లర్ మీట్' ని రాష్ట్రంలోని సూక్ష్మ, చిన్న , మధ్యతరహా పరిశ్రమలు (మీవీజుం) సద్వినియోగం చేసుకోవాలని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ కోరారు. ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల శాఖకు చెందిన ఎ.పి. రివర్స్ బయర్ సెల్లర్ మీట్ 2026 నిర్వాహకులు శుక్రవారం తూర్పు లోని ఎమ్మెల్యే కార్యాలయంలో గద్దె రామమోహన్ ను కలిసి ఈ నెల 7,8 తేదీలలో ఆంధ్రప్రదేశ్ ఎం.ఎస్.ఎం.ఇ.ల ఎగుమతుల అభివృద్ధిలో (ఇ్రావీశణా) భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలోని ఎం.ఎస్.ఎమ్.ఇ. అభివృద్ధి కార్పొరేషన్, 'ఇండియా చిన్న పరిశ్రమల ఫోరమ్' సంయుక్తంగా ఈ మీటింగ్ ను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి గద్దె ను ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విజయవాడ ఎప్పటినుంచో పారిశ్రామికవేత్తలకు, వ్యాపార వాణిజ్య కార్యకలాపాలకు ఒక ముఖ్యమైన కేంద్రంగా ఉందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమలు (మీవీజుం) అంతర్జాతీయ మార్కెట్లతో నేరుగా అనుసంధానం కావడానికి విజయవాడ ఒక వేదికగా మారడం ఎంతో సంతోషకరమని పేర్కొన్నారు. ఎ.పి. రివర్స్ బయర్ సెల్లర్ మీట్ - 2026 ద్వారా మన పారిశ్రామికవేత్తలు అంతర్జాతీయ కొనుగోలుదారులతో నేరుగా చర్చలు జరపడం, కొత్త మార్కెట్లను అర్థం చేసుకోవడం, అలాగే దీర్ఘకాలిక వ్యాపార సంబంధాలను ఏర్పరచుకోవడం లాంటి కార్యక్రమాలను చేపట్టవచ్చని, తద్వారా తమ వ్యాపారాలను, ఎగుమతులను విస్తరించుకునే అవకాశం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కనక ఈ రివర్స్ బయర్, సెల్లర్ మీట్-2026ను ఆంధ్రప్రదేశ్‌లోని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల యజమానులంతా తప్పనిసరిగా పాల్గొని, సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తలపెట్టిన 'ఒక కుటుంబం -- ఒక పారిశ్రామికవేత్త' నిజమవ్వాలంటే, ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో తోడ్పడతాయని తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్‌లో పెట్టుబడుల ద్వారా వ్యాపారాభివృద్ధి, జీవనోపాధి, ఆర్థిక స్వావలంబన దిశగా ముఖ్యమంత్రి ఎన్నో ఆలోచనలు చేస్తున్నారని, ఎన్నో కార్యక్రమాలను రూపొందిస్తున్నారని గద్దె వివరించారు. రాష్ట్రంలో మరిన్ని కుటుంబాలు వ్యాపారాలను స్థాపించి, వాటిని అభివృద్ధి చేసుకునేలా అవకాశాలు కల్పించడం ద్వారా వ్యక్తిగత వ్యాపారాలు, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని, స్థానిక సరఫరా వ్యవస్థలు బలోపేతమవుతాయని, పెట్టుబడులు పెరుగుతాయని శాసనసభ్యులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఎం.ఎస్.ఎం.ఇ.ల ఎగుమతుల అభివృద్ధి కార్యక్రమము (ఇ్రావీశణా) చేపట్టే సమావేశాలు మన మీవీజులకు అవసరమైన పరిజ్ఞానం, ఆత్మవిశ్వాసం, మార్కెట్ పరిచయం, అంతర్జాతీయ అనుసంధానాలను ఏర్పరుస్తాయని, తమ వ్యాపారాలను విస్తరించుకునేందుకు అవకాశాలు కల్పిస్తాయని చెప్పుకొచ్చారు. అంతర్జాతీయ కొనుగోలుదారులను విజయవాడకు హృదయ పూర్వక స్వాగతం పలుకుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొంటున్న అన్ని చిన్న, సూక్ష్మ తరహా పరిశ్రమల ఫలప్రదమై, విజయవంతమైన దీర్ఘకాలిక వ్యాపార భాగస్వామ్యాలు ఏర్పడాలని ఆకాంక్షిస్తున్నట్లు గద్దె చెప్పారు.

# తాళ్లపల్లిలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

## - ఉట్టి కొట్టే కార్యక్రమంలో పాల్గొన్న మాగంటి సుధాకర్ యాదవ్



మాచర్ల, రూరల్ సెప్టెంబర్ 4: నేటి శుభోదయం : నియోజకవర్గంలోని తాళ్లపల్లి గ్రామంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. యర్రగొర్ల సాంబశివరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు బీజేపీ మాజీ రాష్ట్ర కార్యదర్శి మాగంటి సుధాకర్ యాదవ్, అసెంబ్లీ బీఎల్ఏ-1 నాసరయ్య జీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమంలో పాల్గొని సందడి చేశారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలను తిలకించారు. మాగంటి సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ, శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ప్రతి ఏటా సంప్రదాయబద్ధంగా, వైభవంగా నిర్వహిస్తున్న తాళ్లపల్లి గ్రామస్తులను అభినందించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో యువత కీలక పాత్ర పోషించాలని సూచించారు. యువత సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ రాజకీయ చైతన్యాన్ని పెంపొందించుకోవాలని, అదే సమయంలో విద్యా, ఉద్యోగ రంగాల్లో ఉన్నత లక్ష్యాలను సాధించే దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కృష్ణ, బీజేపీ జిల్లా కార్యదర్శి గంజర్ల ఆదిలక్ష్మి, ఎస్ఐఆర్ కన్వీనర్ గొబ్బూరి శ్రీనివాస్ నాయుడు, గుమ్మ శ్రీనివాస్, పీవీఆర్ యాదవ్, పేర్ల గురుస్వామి, ఎండపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి చేసిన వారిని ఆదరించండి అభివృద్ధిని అడ్డుకున్న వారిని ప్రశ్నించండి

**-కూటమి ప్రభుత్వం అభివృద్ధికి నిదర్శనం**

**-ఎమ్మెల్యే బోడె ప్రసాద్**

**-రు.12 కోట్లతో కీలక రహదారుల అభివృద్ధి.. నెలన్నరలో పనులు పూర్తి చేస్తాం**

**-కందలంపాడు,తెన్నేరు,మారేడుమేక గ్రామాలలో సుమారు కోటి 80 లక్షల నిధులతో నిర్మించే కనెక్టివిటీ రోడ్లు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బోడే ప్రసాద్**



పెనమలూరు, సెప్టెంబర్ 4 నేటి శుభోదయ : వైసిపి ప్రభుత్వ పాలనలో గుంతలమయమైన రహదారులకు శాశ్వత పరిష్కారం చూపుతూ పెనమలూరు నియోజకవర్గంలో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం పలు రోడ్లకు శంకుస్థాపన చేసిన అనంతరం మాట్లాడుతూ గత వారం రోజుల్లోనే సాస్కీ నిధులతో సుమారు రు. 12 కోట్లతో పలు కీలక రహదారులకు శంకుస్థాపనలు చేశామని చెప్పారు. ముదునూరు--దోసరపాలెం,కందలంపాడు, కాటూరు--మాణికొండ,ముదునూరు--జబర్లపడి,మారేడుమాక--మాణికొండ,తెన్నేరు తదితర ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఇప్పటికే శంకుస్థాపనలు పూర్తయ్యాయని, నెల నుంచి నెలన్నరలోగా పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమని స్పష్టం చేశారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం నిర్మించిన రోడ్లకు గత ఐదేళ్లలో కనీసం ప్యాచ్‌వర్క్ కూడా చేయకుండా వదిలేయడంతో రహదారులు గుంతలమయమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని విమర్శించారు,రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి అభివృద్ధిని అస్తవ్యస్తం చేసిన పాలనను ప్రజలు తిరస్కరించారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కొక్కటిగా సమస్యలను పరిష్కరిస్తూ,ఆగిపోయిన అభివృద్ధికి మళ్లీ వేగంగా తీసుకొస్తున్నామని తెలిపారు. దాదాపు 20 ఏళ్ల క్రితం రైతుల నుంచి భూమిని సమకూర్చుకుని ఏర్పాటు చేసిన మారేడుమాక--మాణికొండ లింక్ రోడ్డును సుమారు రు. కోటి వ్యయంతో బీటీ రోడ్డుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. మారేడుమాకలో దాదాపు 90 శాతం రోడ్లు, డ్రైనేజీ పనులు పూర్తి చేశామని, మిగిలిన ప్రాంతాల్లో అవసరమైన కనెక్టింగ్ రోడ్లు, ముఖ్యంగా బీసీ కాలనీలో అవసరమైన డ్రైనేజీ పనులను కూడా పూర్తి చేస్తామని చెప్పారు. తెన్నేరు అభివృద్ధికి గత రెండున్నరేళ్లలో వివిధ నిధుల ద్వారా సుమారు రు. 1. 50 కోట్లతో పనులు చేపట్టామని తెలిపారు,ఎస్‌ఈ కాలనీ రైల్వే గేటు నుంచి మండపం సెంటర్ వరకు ప్రధాన రహదారిని అభివృద్ధి చేసి గ్రామానికి మెరుగైన కనెక్టివిటీ కల్పించామని చెప్పారు. అభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా పనిచేస్తున్నామని స్పష్టం చేశారు. ఎవరు ఏ పార్టీకి ఓటు వేశారు అనేది కాదు, ప్రజలకు ఏం అవసరం ఆ అవసరాన్ని ఎలా తీర్చాలి అన్నదే మా ఆలోచన అని తెలిపారు. ఐదేళు అధికారంలో ఉన్న సమయంలో గ్రామాల్లో,పట్టణాల్లో వైసీపీ నేతలు చేసిన అభివృద్ధి ఏమిటో,ఎంత నిధులు ఖర్చు చేశారో ప్రజలకు చెప్పే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. మేము మాటలతో కాదు,రికార్డులతో ప్రజల ముందుకు వస్తున్నామని అన్నారు. ప్రతి గ్రామంలో ఏ తేదీన ఏ పని ప్రారంభించాం, ఎక్కడ శంకుస్థాపన చేశాం,ఎక్కడ ప్రారంభోత్సవం చేశాం,ఎంత నిధులు ఖర్చు చేశాం అనే పూర్తి అభివృద్ధి రికార్డును ప్రజల ముందుంచుతామని తెలిపారు. మున్సిపాలిటీల్లో కూడా ఏ రోడ్డు ఎక్కడ వేశాం, ఎంత నిధులు ఖర్చు చేశాం అనే వివరాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. అభివృద్ధిపై చర్చకు మేము సిద్ధం రికార్డులతో సమాధానం చెప్పడానికి సిద్ధం అని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ సవాల్ చేశారు. వైసీపీ నేతలు ముందుగా ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాలన్నారు. ఐదేళ్లు అధికారం ఇచ్చినప్పుడు మీ గ్రామానికి ఏం చేశారని మీ పట్టణానికి ఏం చేశారని,ఎంత నిధులు తీసుకొచ్చారు. ఎన్ని అభివృద్ధి పనులు పూర్తి చేశారు. ముందుగా ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాలి,ఆ తర్వాతే ప్రజలను ఓటు అడగాలి అని అన్నారు. పెనమలూరు నియోజకవర్గ ప్రజలు గతాన్ని ఒక్కసారి గుర్తు చేసుకోవాలని,ఈ రెండున్నరేళ్లలో జరిగిన అభివృద్ధిని పరిశీలించి పనితీరును బేరీజు వేసుకోవాలని కోరారు. పెనమలూరు ప్రగతి కోసం కూటమి అభ్యర్థులను గెలిపిద్దామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌడ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరామ ప్రసాద్, గౌడ్ కంకిపాడు మండల పార్టీ అధ్యక్షులు జంపన వెంకటేశ్వరరావు, యార్లగడ్డ రాజా, మోవ్వ మహేష్ చిట్టూరి నాగేశ్వరరావు, లక్ష్మి, కూటమి నాయకులు, కార్యకర్తలు,అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# అడిగొప్పలలో విస్తృత కార్డెన్ అండ్ సెర్చ్..!

**16 ద్విచక్ర వాహనాలు స్వాధీనం**



దుర్గి, సెప్టెంబర్ 4 (నేటి శుభోదయం): శాంతిభద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాల నిర్మూలన, నేరాల నియంత్రణే లక్ష్యంగా దుర్గి పోలీస్ స్టేషన్ పరిధిలోని అడిగొప్పల గ్రామంలో శుక్రవారం పోలీసులు విస్తృతంగా 'కార్డెన్ అండ్ సెర్చ్' ఆపరేషన్ నిర్వహించారు. పల్నాడు జిల్లా అదనపు ఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి, ఐపీఎస్ ఆదేశాల మేరకు, గురజాల డీఎస్పీ మహేశ్వరావు పర్యవేక్షణలో ఉదయం 6 గంటల నుంచే గ్రామంలో ముమ్మర తనిఖీలు చేపట్టారు. పోలీసు అధికారులు, సిబ్బందిని ప్రత్యేక బృందాలుగా విభజించి గ్రామంలోని వీధులు, అనుమానాస్పద ప్రాంతాలను జల్లెడ పట్టారు. ముఖ్యంగా రౌడీషీటర్లు, గతంలో నేర చరిత్ర కలిగిన వ్యక్తులు, పాత కేసుల్లోని నిందితుల ఇళ్లలో విస్తృత సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 16 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం గ్రామంలో అధికారులు ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించి, స్థానిక ప్రజలతో ముఖాముఖి సమావేశమయ్యారు. రాబోయే స్థానిక ఎన్నికల నేపథ్యంలో గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రజలకు భరోసా కల్పించేందుకే ముందస్తు జాగ్రత్త చర్యగా ఈ తనిఖీలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. గ్రామంలో అకారణంగా గొడవలు సృష్టించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని ఉపేక్షించేది లేదని, వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాత కేసుల నిందితులను పిలిపించి, పాత పంథాను విడిచిపెట్టి సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

# కార్యకర్తల కుటుంబాలకు రూ. 15 లక్షల బీమా నగదును అందచేసిన శాసనసభ్యులు వెనిగండ్ల రాము





గుడివాడ, సెప్టెంబర్ 4 నేటి శుభోదయ : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆధ్వర్యంలో నడుస్తున్న కార్యకర్తల సంక్షేమ నిధి ప్రమాద బీమా పథకం దీనికి సంబంధించి ప్రమాదవశాత్తు మరణించిన గుడివాడ నియోజకవర్గానికి చెందిన ముగ్గురు క్రియాశీల పార్టీ కార్యకర్తల కుటుంబాలకు టీడీపీ భీమా పాలసీ ప్రకారం ఒక్కో కుటుంబానికి రూ. 5 లక్షల చొప్పున, ముగ్గురికీ కలిపి మొత్తం రూ. 15లక్షల బీమా చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. బాధిత కుటుంబాలను పరామర్శించిన వెనిగండ్ల రాము పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్త కుటుంబానికి తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

# నేడు గురుపూజోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకోనున్న కోరుకొండ మండల గురువులు వీరే..!!










కోరుకొండ, సెప్టెంబర్ 4, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె) : విద్యా లోకంలో అతి పవిత్రమైన గురుపూజోత్సవం కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా అత్యంత అట్టహాసంగా నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో విద్యాశాఖ పర్యవేక్షణలో విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన అధ్యాపకులను జిల్లాస్థాయి అధికారుల సమక్షంలో ఘనంగా సత్కరించనున్నారు. సెప్టెంబర్ 5వ తేదీ శనివారం జిల్లాస్థాయిలో జరగనున్న గురుపూజోత్సవ వేడుకల వేదికపై పలువురు గురువులకు ఈ గౌరవం దక్కనుంది. కాగా కోరుకొండ మండలం నుంచి ఎన్నికైన ఉత్తమ ఉపాధ్యాయులు ఐదుగురు వివరాలను మండల విద్యాశాఖ అధికారి కుశలవదొర శుక్రవారం సాయంత్రం విడుదల చేశారు. వారి వివరాలు - జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన వారు కోరుకొండ ఎంపీపీ స్కూల్ (నెంబర్ 2) మింగి శ్రీనివాస్, శ్రీరంగపట్నం ఎంపీపీ స్కూల్ శ్రీమతి షేక్ రహీమా బేగం, అలాగే శ్రీరంగపట్నం ఎంపీపీ స్కూల్ ఎస్ శివలు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపిక అయ్యారు. అలాగే కొత్తపల్లి శ్రీనివాస్ (మేథ్స్) వారికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయలు గా ఎంపిక కావడం వలన అభినందనలు తెలియజేసారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గాడాల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు ఎన్ సుబ్బారావు ఎస్ ఏ (ఇంగ్లీష్) వారిని ఎంపికైనట్లు అధికారులు తెలిపారు. వారందరికీ ఎంఈఓ కుశలవ దొర శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఇంద్రకీలాద్రిపై ఉత్సాహభరితంగా 'ఉట్టి కొట్టే' వేడుకలు

**భక్తిపారవశ్యంతో పాల్గొన్న చిన్నారులు,భక్తజనం.**



విజయవాడ, సెప్టెంబర్ 4 (నేటి శుభోదయ): శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో శుక్రవారం సాయంత్రం 'ఉట్టి కొట్టే' (ఉట్లోత్సవం) వేడుక అత్యంత వైభవంగా, కోలాహలంగా జరిగింది. ఆలయ రాజగోపురం ముందు భాగంలో ఏర్పాటు చేసిన ఈ వేడుకకు పెద్ద సంఖ్యలో భక్తులు, చిన్నారులు తరలివచ్చారు. మొదటగా ఆలయ అర్చకులు పూజాదికములు నిర్వహించగా, ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో వికె శీనానాయక్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఉట్టి కొట్టే వేడుకల్లో చైర్మన్, ఈవో, అధికారులు, ట్రస్ట్ బోర్డు మెంబెర్స్ తో పాటు భక్తులు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని ఉట్టిని కొట్టేందుకు పోటీపడ్డారు. మంగళవాయిద్యాల చప్పుళ్లు, వేద మంత్రాలు,'గోవిందా.. గోపాల..' నామస్మరణలు, భక్తుల కేరింతల నడుమ ఉట్టి సంబరం ఆద్యంతం కనులవిందుగా సాగింది. కృష్ణుని బాల్య లీలలను గుర్తుచేసే విధంగా ఉత్సాహపూరిత వాతావరణాన్ని సిబ్బంది కల్పించారు. ఉదయం ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక అభిషేకాలు, గోపూజల అనంతరం సాయంత్రం జరిగిన ఈ ఉట్టి ఉత్సవంతో ఇంద్రకీలాద్రిపై కృష్ణాష్టమి సంబరాలు పరిపూర్ణ ఆధ్యాత్మిక శోభతో ముగిశాయి. ఈ కార్యక్రమంలో దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యులు పి.రాఘవరాజు, ఎ. శ్రీనివాసరావు, ప్రత్యేక ఆహ్వానితులు వెలగపూడి శంకర బాబు,ఉప ప్రధాన అర్చకులు బి. శంకర శాండిల్య,ఉప కార్యనిర్వహణాధికారి కిషోర్ కుమార్, సహాయకార్యనిర్వహణాధికార్లు ఎన్. రమేష్ బాబు, డాక్టర్ కె. గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమం తిలకించారు.

# నేడు ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి కేసీ కెనాల్ కు నీటి విడుదల



నంద్యాల, సెప్టెంబర్ 4, నేటి శుభోదయ : నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గం పగిడ్యాల మండలంలోని ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి కేసీ కెనాల్ కు నీరు విడుదల చేస్తున్నట్లు నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి శుక్రవారం సాయంత్రం తెలిపారు. తాగునీటికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందని, ప్రజల దాహార్తి తీర్చడం మా మొదటి కర్తవ్యం అని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి చెప్పారు.

NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA,VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -"APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,"D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .

## "గురుపూజోత్సవ శుభవేళ ... నా అక్షర ప్రణామాలు "

పుస్తకాల పేజీల నుంచి జీవిత పాఠాల వరకు... అడుగు తడబడిన ప్రతిసారీ పట్టుకొమ్మై నిలిచిన రూపు గురువు!

చీకటి వంటి అజ్ఞానాన్ని తరిమేసి, అక్షర దివ్వెలతో మనసును వెలిగించే అనంత జ్ఞాన జ్యోతి గురువు.

గెలుపు పిలుపునిచ్చే వేళ వెనక ఉండి నవ్వి, ఓటమి పలకరించే వేళ ముందు నిలిచి ధైర్యం చెప్పే కరుణామూర్తి గురువు .

ఆలోచనకు పదును పెట్టి, ఆశయానికి రెక్కలు తొడిగి, ఉన్నత శిఖరాలకు మార్గం చూపే మార్గదర్శి గురువు.

దైవం కంటే ముందే మోకరిల్లే అత్యున్నత స్థానం... శిల్పంలా రూపు తీర్చిదిద్దే బ్రహ్మ స్థానం గురువుది.

మాటల్లో వివేకాన్ని, చేతల్లో వినయాన్ని నూరిపోసి సన్మార్గంలో నడిపించే అక్షర ప్రదాత గురువు.

మనలోని ప్రతిభను మనకంటే ముందే గుర్తించి, భవిష్యత్తు వైపు నడిపించే నిస్వార్థ స్నేహితుడు గురువు .



జ్ఞాన ధనాన్ని పంచేకొద్దీ పెరుగుతుందని చాటుతూ, తరతరాల భవిష్యత్తును తీర్చిదిద్దే శిల్పి గురువు .

గురువు చూపిన బాటలోనే నేటి విజయం... ఆ అడుగుజాడలే రేపటి పునాది!

నన్ను తీర్చిదిద్దిన, నన్ను నడిపిస్తున్న గురుదేవులందరికీ గురుపూజోత్సవ హృదయపూర్వక ప్రణామాలు.

-- కుర్రా ప్రసాద్ బాబు, ఒంగోలు.

## సోమవారం గ్రామంలో కృష్ణాష్టమి వేడుకలకు ముఖ్య అతిథిగా బిజెపి సీనియర్ నేత వీరన్న చౌదరి..!

### - ప్రత్యేక పూజలు చేసి వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టిన భక్తులు







కోరుకొండ, సెప్టెంబర్ 4, నేటి శుభోదయం ప్రతినిధి (ఏ.కె) : హిందువులు అతి పవిత్రంగా జరుపుకునే మహా పర్వదినం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శుక్రవారం వాడవాడలా అత్యంత అట్టహాసంగా నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు, భక్తులు, మహిళలు, హిందువులు ఎంతో భక్తి శ్రద్ధలతో తెల్లవారుజాము నుంచి శ్రీకృష్ణ మందిరాలలో వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు, నిర్వహించారు. ఈ సందర్భంగా కిర్లంపూడి మండలం సోమవారం గ్రామంలో శ్రీకృష్ణ దేవాలయంలో నిర్వహించిన జన్మాష్టమి వేడుకలకు భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, రాజానగరం నియోజకవర్గం మాజీ ఇంచార్జ్ నీరుకొండ వీరన్న చౌదరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయంలో శ్రీకృష్ణ భగవాన్ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ నిర్వాహకులు ఆధ్వర్యంలో స్వామివారికి వివిధ సేవా కార్యక్రమాలు, భజనలు, ప్రత్యేక అర్చనలు జరిపారు. ఈ సందర్భంగా వీరన్న చౌదరి మాట్లాడుతూ.. మన సంస్కృతి, సంప్రదాయాలను, దేవాలయాలను, సనాతన ధర్మాన్ని క్రమం తప్పక ఆచరించవలసిన అవసరం భారతదేశంలో పుట్టిన ప్రతి ఒక్కరిపై ఉ ందన్నారు. శ్రీకృష్ణ పరమాత్మ బోధించిన గీతా సారాంశాన్ని నేటి తరానికి, భవిష్యత్ తరానికి తెలియజేయవలసిన ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. తద్వారా ఎన్నో ప్రయోజనాలతో పాటు మన సమాజం శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లుతుందని వీరన్న చౌదరి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, స్థానిక నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## సాగునీటి ప్రాజెక్టులకు వేలకోట్లు ఖర్చు చేసింది టిడిపి నే

### - రాయలసీమతో పాటు కోస్తా ఆంధ్రకు కూడా పెద్దపీట వేసింది కూటమి ప్రభుత్వమే
### - రాయలసీమ ద్రోహి జగన్మోహన్ రెడ్డి
### - వైసిపి ప్రభుత్వంలో హంద్రీనీవాకు 2000 కోట్లు కేటాయించారు
### - 2014, 2019 టిడిపి ప్రభుత్వంలో హంద్రీనీవాకు 12వేల 484 కోట్లు చంద్రబాబు కేటాయించారు
### - ప్రభుత్వ విప్,రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు



అనంత పురం బ్యూరో సెప్టెంబర్ 04 నేటి శుభోదయ : కూటమి ప్రభుత్వంలో సాగునీరు, తాగునీరు కోసం వేల కోట్లు నిధులు కేటాయించడం జరిగిందని, ముఖ్యంగా రాయలసీమ హంద్రీనీవా ప్రాజెక్టు పూర్తి చేయడానికి ఇప్పటికే 12000 కోట్లు నిధులు కేటాయించడం జరిగిందని అన్ని ప్రాంతాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమానంగా చూస్తున్నారని క్రెడిట్ అంతా చంద్రబాబు నాయుడు ది అని ప్రభుత్వ విప్ రాయదుర్గం శాసనసభ్యులు కాల్వ శ్రీనివాసులు స్పష్టం చేశారు. శుక్రవారం అమరావతిలో లో టిడిపి కేంద్ర కార్యాలయంలో కాల్వ శ్రీనివాసులు ప్రెస్ మీట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాల్వ శ్రీనివాసులు మాట్లాడుతూ 2019 ,2024 ఐదేళ్లపాటు వైసిపి ప్రభుత్వం పరిపాలించింది అని అభివృద్ధి కార్యక్రమాలు కూడా ఏమి చేయలేదని కేవలం హంద్రీనీవా ప్రాజెక్టుకు 2000 కోట్లు మాత్రమే కేటాయించడం జరిగిందన్నారు. టిడిపి ప్రభుత్వం 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్నామని సాగునీటి తాగునీటి ప్రాజెక్టులకు 60 వేల కోట్లు నిధులు కేటాయించడం జరిగిందన్నారు. వెలుగొండ ప్రాజెక్టుకు రూపకల్పన చేసింది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని 1996 నుంచి 2004 వరకు వెలుగొండ ప్రాజెక్టుకు వేల కోట్లు ఖర్చు చేశారని అయితే జగన్మోహన్ రెడ్డి వెలుగొండ ప్రాజెక్టు తెచ్చింది రాజశేఖర్ రెడ్డి అని జగన్మోహన్ రెడ్డి గొప్పలు చెప్పుకోవడం సమంజసం కాదన్నారు. తండ్రి కొడుకులు సాగునీటి ప్రాజెక్టులకు కొంతమేర నిధులు కేటాయించి రాష్ట్రంలో ఉన్న అన్ని ప్రాంతాల్లో తండ్రి కొడుకులు ఆంధ్రప్రదేశ్ను అభివృద్ధి చేశామని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. రాయలసీమ ద్రోహి జగన్మోహన్ రెడ్డి అని విమర్శించారు.

## ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు ప్రధానం

### కార్యక్రమానికి హాజరైన ఎం పి అంబికా లక్ష్మీనారాయణ







అనంతపురం బ్యూరో సెప్టెంబర్ 04 నేటి శుభోదయ : అనంతపురం నగరంలోని ఆర్ట్స్ కళాశాల డ్రామా హాల్ లో ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ, మేరా యువ భారత్, యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన గురుపూజోత్సవం ఉత్తమ ఉ పాధ్యాయ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ప్రపంచంలో ఉపాధ్యాయ వృత్తిని మించిన గొప్ప వృత్తి మరొకటి లేదని నేను విశ్వసిస్తాను. ఉ పాధ్యాయులు విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాలను మాత్రమే బోధించకుండా, వారి జీవితాలకు మార్గదర్శకులుగా నిలుస్తూ, సమాజానికి ఉత్తమ పౌరులను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సందర్భంగా అనంతపురం జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో విశిష్ట సేవలు అందిస్తున్న 65 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు ప్రదానం చేసి ఘనంగా సత్కరించడం ఎంతో ఆనందంగా అనిపించింది. ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమాన్ని చక్కగా నిర్వహించిన ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకులు సుంకర రమేష్ ని ఈ సందర్భంగా అభినందించారు. ఉపాధ్యాయుల సేవలను గుర్తించి, వారిని సత్కరించే ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు అంకితభావంతో పనిచేస్తున్న ప్రతి ఉపాధ్యాయుడికి హృదయపూర్వక గురుపూజోత్సవ శుభాకాంక్షలు అని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ తెలిపారు.

## పల్లె పండుగలో పశువుల షెడ్డుకు భూమిపూజ

వేముల సెప్టెంబర్ 4: స్థానిక వేముల గ్రామ పంచాయతీలో పల్లె పండుగ 3.0లో భాగంగా పశువుల షెడ్డు నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఎంపీడీవో,మండల టీడీపీ నాయకులు పేర్ల శేషారెడ్డి భూమిపూజ చేశారు. గ్రామీణ మౌలిక వసతులతో పాటు రైతులు,పశుపోషకుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీడీవో తెలిపారు. పల్లె పండుగ ద్వారా ప్రజలకు నేరుగా ఉపయోగపడే పనులు వేగవంతం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారి,బేర్‌ఫుట్ టెక్నీషియన్,ఫీల్డ్ అసిస్టెంట్,రైతులు,ఎన్డీఏ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పేద,మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన బియ్యాన్ని అందిస్తాం

### - ఇందుకోసం నాలుగు కౌంటర్లను ఏర్పాటు చేసాం
### - జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్



అనంతపురం బ్యూరో సెప్టెంబర్04 నేటి శుభోదయ : బహిరంగ మార్కెట్ లో పెరుగుతున్న బియ్యం ధరల దృష్ట్యా, పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు, పేద మధ్య తరగతి ప్రజలకు నాణ్యమైన బియ్యాన్ని తక్కువ ధరకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు జిల్లాలో నాలుగు ప్రత్యేక బియ్యము కౌంటర్లు 1) అనంతపురం నగరం లోని రైతు బజారు 2) మార్కెట్ యార్డ్, గుంతకల్ 3) నేతాజి రోడ్డు, రైల్వే స్టేషన్ దగ్గర, రాయదుర్గం 4) పాత బస్టాండ్ దగ్గర, మెయిన్ బజార్, తాడిపత్రి ల వద్ద ఏర్పాటు చేసి మార్కెట్ ఇంటర్వెన్షన్ ప్రోగ్రామ్ అమలు చేస్తున్నామని జిల్లా సంయుక్త కలెక్టర్ సి. విష్ణు చరణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.- ఆ మేరకు స్టీం బియ్యం కిలో రూ.52/- లకు ముడి బియ్యం కిలో రూ.50/- లకు ప్రతి ఆధార్/రేషన్ కార్డుకు 10 కేజీల చొప్పున లబ్ధిదారులకు అందుబాటులో వుండేవని, ప్రస్తుతం ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని బియ్యం సరఫరాను మరింత విస్తరించడంతో పాటు, అందరికీ అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా, ప్రతి ఆధార్ / రేషన్ కార్డుకు 26 కేజీల చొప్పున లబ్ధిదారులకు అందుబాటులో వుంచామని, కాబట్టి, ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సంయుక్త కలెక్టర్ తెలిపారు.ఈ స్పెషల్ కౌంటర్లు ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు మరియు మధ్యాహ్నం 3.00 గంటల నుండి సాయంత్రం 6.00 గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉంటాయని తెలియజేశారు. ఈ స్పెషల్ కౌంటర్లలో నాణ్యమైన సరైన తూకంతో, నిర్ణీత ధరలు అమలు అయ్యేలా క్షేత్రస్థాయిలో క్రమం తప్పకుండా తనిఖీలు చేయవలసినదిగా సివిల్ సప్లైస్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పంపిణీ లో పారదర్శకత పెంచడానికి, దుర్వినియోగాన్ని అరికట్టడానికి చర్యలు తీసుకుంటామని, అర్హులైన వినియోగదారులకే వీటిని విక్రయిస్తారని తెలిపారు. రైస్ మిల్లర్లను సమన్వయంతో బియ్యం సేకరణ, రవాణా, పంపిణీ నిరంతరాయంగా జరిగేలా పౌరసరఫరాలు, మార్కెటింగ్ శాఖకు బాధ్యతలు అప్పగించామని తెలియజేశారు.

## కృష్ణ నామస్మరణతో మార్మోగిన శ్రీకృష్ణాలయం



ప్రొద్దుటూరు, సెప్టెంబర్ 4: శివాలయం వీధిలోని శ్రీకృష్ణాలయంలో శ్రీకృష్ణాలయ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేణుగోపాలస్వామికి పంచామృత,గోక్షీరాభిషేకాలు నిర్వహించి,పట్టువస్త్రాలు,వెండి కవచాలు, పుష్పమాలలతో అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి,మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య,మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి,టీడీపీ పట్టణాధ్యక్షుడు చల్లా రాజగోపాల్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ,ఉట్టికొట్టు కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం రుక్మిణి,సత్యభామ సమేత శ్రీకృష్ణుడి ఉత్సవమూర్తులతో గ్రామోత్సవం నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో యాదవ సేవా సంఘం అధ్యక్షుడు దాసరి బాలసుబ్బరాయుడు యాదవ్,కార్యదర్శి రాచగొల్ల వెంకటరమణ యాదవ్,కోశాధికారి శ్రీనివాసులు,యాదవ ప్రముఖులు,భక్తులు పాల్గొన్నారు.